సహజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక 20-6-2025 15/-



# బక్రీద్

## సాఫల్యానికి నాలుగు మెట్లు





ముస్లిం సామాజిక వర్గానికి మరోసారి 'మొండిచెయ్యి'

## మంత్రి పదవి ఎండమావేనా?

సహజీవన భావాల పావురాయి
గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 24 హైదరాబాద్
శుక్రవారం 20 జూన్ 2025 రూ.15-00
23 జిల్‌హజ్జ 1446 హిజ్రీ

**తొలిగీటు**

నిత్యావసర పదార్థాల్ని నిలువ చేసే వ్యక్తి అల్లాహ్ శాపానికి గురవుతాడు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**


Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




## లోపల...


| | | |
|---|---|---|
| కులగణన | ...... | 04 |
| బక్రీద్ | ...... | 05 |
| ముస్లిం సామాజిక వర్గానికి మరోసారి 'మొండిచెయ్యి' | ...... | 08 |
| మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి) – 2 | ...... | 10 |
| చరితార్థులు-2 : అబ్దుల్ కరీం లంజీ | ...... | 13 |
| పెళ్ళి సంబంధాలు | ...... | 14 |
| ఉర్దూలో పాఠశాల పేరు.. ప్రిన్సిపాల్ సస్పెండ్... | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| సాఫల్యానికి నాలుగు మెట్లు | ...... | 20 |
| నగరం (కవిత) | ...... | 22 |
| తల్లి పాదాల క్రిందనే స్వర్గం | ...... | 23 |
| శ్రేయోభిలాషా! నీ పేరే ఇస్లామ్ | ...... | 28 |
| నోరే నాకం నోరే నరకం | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |


**మరోసారి మొండిచెయ్యి...**



క్యాబినెట్లో లేదటలే
ముస్లిములకు పదవి
ముక్కున వేలేసుకొని
విరుస్తు ఉన్రు పెదవి!
ఓటు బ్యాంకుగా చూడ్డం
ముమ్మాటికి అది తప్పు
ఇది ఇలాగే కొనసాగితే
కొడతరంట చావుడప్పు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

## ఆలోచన

# కులగణన

**జనాభా లెక్కలతో పాటు** కులగణన చేయించడానికి ప్రధాని మోడీ సిద్ధమయ్యారు. ప్రతిపక్షాలు ఎప్పటి నుంచో కులగణన జరపాలని కోరుతున్నాయి. అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్ వంటి సోషలిస్టు నేతలు మాత్రమే కాదు, నిజానికి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సయితం చాలా బలంగా కులగణన జరిపించాలని కోరుతూ వచ్చారు. కులగణన జరిగితేనే సమాజంలో వివిధ కులసముదాయాల స్థితిగతులు తెలుస్తాయంటున్నారు.

నిజానికి ఇప్పటి వరకు బీజేపీ కులగణనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చింది. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత ఛత్తీస్ గఢ్ బీజేపీ నుంచి వచ్చిన ట్వీటు కూడా అలాంటిదే. కార్టూన్ చిత్రాన్ని వేసి కులం అడగలేదు, మతం అడిగారంటూ ట్వీట్ చేశారు. కులగణన అంటే సమాజాన్ని చీల్చడమే అన్నట్లు మాట్లాడారు. మోడీ అయితే తనకు తెలిసింది నాలుగే కులాలని – పేదలు, మహిళలు, యువత, రైతులని చెప్పారు. కులగణన అనేది అర్బన్ నక్సల్ ఆలోచన అన్నారు.

కాని 2024 లోకసభ ఎన్నికల తర్వాత పరిస్థితి మారింది. నితీష్ కుమార్, చిరాగ్ పాశ్వాన్, చంద్రబాబు నాయుడు మద్దతివ్వకపోతే కష్టం. ఈ నేతలు కులగణన కావాలంటున్నారు. బీహార్ ఎన్నికలు త్వరలో రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో బీజెపికి యు టర్న్ తప్పలేదు.

మోడీ మూడవసారి ఎన్నికైన తర్వాత యు టర్న్ ఇదే మొదటిసారి కాదు. ఇంతకు ముందు బ్యూరోక్రసీలో లేటరల్ ఎంట్రీ విషయంలో వెనుకడుగు వేయక తప్పలేదు. బీజేపీ 2014 తర్వాతి నుంచి వరుసగా గెలుపొంద డానికి కారణం వెనుకబడిన వర్గాల నుంచి లభిస్తూ వచ్చిన మద్దతే. కాని, కులగణన, వెనుకబడిన కులాలకు రిజర్వేషన్ల విషయం వచ్చేసరికి బీజేపీ ఇంతవరకు వ్యతిరేకిస్తూ వచ్చింది.

అయోధ్య రామమందిరం రాజకీయాలు దళిత, వెనుకబడిన వర్గాల్లో కూడా చాలా మందిని బీజేపీ వైపు మొగ్గేలా చేశాయన్నది యదార్థం. కాని ఇప్పుడు అయోధ్య రాజకీయాలు నడిపే అవకాశం కూడా లేదు. మరోవైపు రాజ్యాంగాన్ని మార్చేస్తామన్నట్లు 2024 ఎన్నికల్లో కొందరు బీజేపీ నేతలు చెప్పిన మాటలు కూడా ప్రతికూల ప్రభావాన్ని వేశాయి. 400 కన్నా ఎక్కువ స్థానాలు సాధిస్తామన్న పార్టీ చివరకు కనీస మెజారిటీ కూడా సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో కులగణనకు ఒప్పుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. కులగణనకు ఒప్పుకోవడమంటే బలహీనవర్గాల అభ్యున్నతికి, రిజర్వేషన్లకు ఒప్పుకోవడమే అవుతుంది. గతంలో అంటే 2021లో వ్యవసాయ చట్టాల విషయంలో కూడా చివరకు దిగిరాక తప్పలేదు. కులగణనకు ఒప్పుకోవడం అంటే రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితి తొలగించడానికి కూడా సిద్ధపడడమే అవుతుంది. రాహుల్ గాంధీ తదితర నేతలు ఈ పరిమితిని అనేక సార్లు విమర్శించారు.

బీహార్ ఎన్నికల్లో మోడీ మాస్టర్ స్ట్రోక్ అని చాలా మంది బీజేపీ అభిమానులు కులగణనను ఆకాశానికి ఎత్తవచ్చు. కాని కులగణన తర్వాత రిజర్వేషన్లు, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగింపు వంటి డిమాండ్లు సహజంగానే వస్తాయి. బీజేపీ వీటన్నింటికి సిద్ధంగా ఉందా? భారత రాజకీయాల్లో మరోసారి మండల్ దశ ప్రారంభమయ్యే సంకేతాలు ఇవన్నీ అంటున్నారు కొందరు.

అబ్దుల్ వాహెద్




**ఇప్పుడు గ్రీన్ బక్రీద్ అనే మాట** తరచూ వినిపిస్తోంది. బక్రీద్ పండుగ అంటే అమాయక పశువులను చంపేయడమే అన్నట్లు చిత్రీకరించడం, బక్రీద్ రోజున ఖుర్బానీ నిషేధించ డానికి "పశువులపై క్రూరత్వ చట్టం 1960" అమలు చేయా లని డిమాండ్ చేయడం వంటివి తరచూ వినిపిస్తూనే ఉన్నాయి. ఈ సంవత్సరం కూడా దీనికి మినహాయింపు కాదు.

అంతేకాదు, ఇక్కడ గమనించవలసిన మరో విషయమేమి టంటే, ఖుర్బానీ అనేది ఇస్లాం హింసాత్మక స్వభావానికి చిహ్నంగా చూపించి ఇస్లాంపై బురదజల్లే ప్రయత్నం కూడా ఇది. పైగా ఇది అహింసాత్మక హిందూ ప్రజల మనోభావాలను గాయపరుస్తుందన్నట్లు కూడా కొందరు ప్రచారం చేస్తుంటారు.

ఈ మొత్తం వ్యవహారం ఎలా తయారైందంటే ఎవరైనా ముస్లిం తన ఇంట్లో ఒక ఆవును పెంచుకుంటే అనుమానాస్పదుడిగా .... కాదు.. కాదు.. నేరస్తుడిగా మారిపోతున్నాడు.

ఇలాంటి సంఘటనే ఒకటి నోయిడాలో జరిగింది. తన ఇంట్లో పిల్లల పాల కోసం ఆవును పెంచుకుంటున్న ఒక ముస్లిం ఇంటి బయట ఆవు కట్టేసి ఉంది. ఎవరో ఫోటో తీసి ఖుర్బానీ ఇస్తున్నాడని సోషల్ మీడియాలో పెట్టారు. అంతే విచారణ మొదలు. చివరకు పోలీసులు ఆ ఆవును ఎప్పటి నుంచో పాలకోసం పెంచుతున్నాడని నిర్ధారణ చేసుకున్నారు. ... ఇదీ పరిస్థితి.

మరో విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే, బక్రీద్‌కు ముందు జైన సమాజం పెద్ద సంఖ్యలో పశువులను కొనేసి వాటిని కాపాడేస్తున్నామంటున్నది. సరే బక్రీద్ రోజున కోయకుండా కొని కాపాడేస్తున్నారు. బాగానే ఉంది. కాని రోజూ మాంసం విక్రయాలు జరుగుతున్నాయి కదా. కొనేవారు ముస్లిములు మాత్రమే కాదు. రోజూ మేకలు, గొర్రెలు వధ్యశాలకు వెళు తూనే ఉన్నాయి. మరి ప్రతిరోజూ ఈ జీవరక్షణ ఎందుకు జరగడం లేదు?

ఆ మధ్య అంబానీ పుత్రరత్నం కూడా ఒకరోజు కోళ్ళను కొనేసి వాటిని కాపాడిన వార్త వచ్చింది. ఫోటోతో సహా....

ఈ సారి మహారాష్ట్రలో పశువుల మార్కెట్లో అమ్మకాలు జరగ రాదని కూడా ప్రయత్నాలు చేశారు. పశువుల అమ్మకాలు జరక్కుండా అడ్డుకోవడమంటే నిజానికి పశుపాలకులైన పేద దళిత, ఆదివాసీ, ఓబీసీ ప్రజల జీవనోపాధిని దెబ్బకొట్టడమే అని అశోక్ భారతి ట్వీట్ చేశారు.

నిజానికి దేశంలో ప్రతి ఏటా అనేక పండుగల సందర్భాల్లో బలులు జరుగుతున్నాయి. కాని బక్రీద్ వచ్చినప్పుడు మాత్రమే జీవప్రేమ పొంగుకొచ్చి ఈ వాదనలు చేస్తుంటారు. కేఎఫ్సీలో చికెన్ కోళ్ళను చంపకుండానే తింటున్నారా? బక్రీద్ రాగానే జంతుప్రేమ పొంగుకొస్తుంటుందా?

అహ్మదాబాద్‌లో ఈ జంతుప్రేమికులు గొర్రెలను రవాణా చేస్తున్న గొర్రెల వ్యాపారులను అడ్డుకుని వారిని తరిమేశారు. ఈ గొర్రెలు అమ్మడానికి తెచ్చినవారు ముస్లిములు కాదు.

పేద హిందువులే.

ఆసిం వకార్ ఈ విషయమై మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దేశంలో దాదాపు 350 కోట్ల కోళ్ళు, 25 కోట్ల కన్నా ఎక్కువ గొర్రెలు, మేకలు మాంసం కోసం చంపబడుతున్నాయని లెక్కలు చెబుతూ, ఏడాది మొత్తం కనిపించని జంతుప్రేమ బక్రీద్ రోజునే ఎందుకు పొంగుకొస్తుందని నిలదీశాడు. అలాగే రాజాసింగ్‌కు ఆయన జవాబిస్తూ, తెలంగాణలోనే మెదక్‌లో చాలా పెద్ద వధ్యశాల ఉంది, దాని పేరు **అల్ కబీర్,** దాని యజమాని పేరు సతీష్ సబ్బర్‌వాల్, ఈ వధ్యశాల నుంచి 35 దేశాలకు గొడ్డు మాంసం ఎగుమతి అవుతుంది అని చెప్పారు. స్వయంగా ప్రధాని మోడి కూడా ఒక సందర్భంలో ఏదో ఒక కమ్యునిటీ మాత్రమే ఈ వ్యాపారంలో లేదని, తన జైన మిత్రులు కూడా చాలా మంది ఉన్నారని చెప్పారు. ప్రతి సంవత్సరం బక్రీద్ రోజున మేకలు, గొర్రెలు కొని వాటిని కాపాడే జైన సమాజం, తమ వాళ్ళు చేసే వ్యాపారాల విషయంలో ఎందుకు మౌనంగా ఉంటుంది?

ప్రతిసారి బక్రీద్‌కు ముందు ఈ గగ్గోలు మామూలైపోయింది.

బక్రీద్ రోజున మేక లేదా గొర్రె రూపంలోని కేకులు కోసుకోవాలని, లేదా మట్టిబొమ్మ కోసుకోవాలని అలా చేస్తే గ్రీన్ బక్రీద్ అవుతుందని కొందరు ఉచిత సలహాలు ఇచ్చారు.

ఇదంతా పశువుల పట్ల ప్రేమతో చేస్తున్నారా? ... అలా కూడా కాదు. ఎందుకంటే హలాల్ మాంసం కొనకండి, ఝుట్కా మాంసం కొనండి అంటూ ప్రచారం చేసేవాళ్ళు కూడా ఇందులో ఉన్నారు. అంటే అసలు విషయం ముస్లిం ద్వేషం, జంతు ప్రేమ కాదు.

దేశంలో 14 శాతం ముస్లిములున్నారు. ఖుర్బానీ ఇవ్వడం అన్నది స్థోమత ఉన్న ముస్లిములు మాత్రమే చేస్తారు. స్థోమత లేనివారికి ఖుర్బానీ ఇవ్వవలసిన అవసరం లేదు. వారికి ఖుర్బానీ ఇచ్చిన వారి నుంచి మాంసం లభిస్తుంది. దేశ జనాభాలో దాదాపు ఒక అంచనా ప్రకారం 20 కోట్ల మంది ముస్లిములున్నారని అనుకుంటే, ఇందులో ఖుర్బానీ ఇచ్చే స్థోమత ఉన్నవారు పది శాతం ఉంటారనుకోవచ్చు. అంటే 2 కోట్ల మంది ఖుర్బానీ ఇచ్చి ఉంటారని చెప్పుకోవచ్చు. అంటే 2 కోట్ల మంది ముస్లిములు కనీసం ఒక మేకో, గొర్రో ఖుర్బానీ ఇచ్చి ఉంటారు. 2 కోట్ల మంది ముస్లిములు 2 కోట్ల గొర్రెలు లేదా మేకలను ఖుర్బానీ ఇచ్చి ఉంటే... ప్రతి గొర్రె సగటున 10 వేల రూపాయలు అనుకుందాం. రెండు కోట్ల మంది 10 వేల చొప్పున పశువులు కొని ఉంటే ఎంతయ్యింది? 20 వేల కోట్ల రూపాయలు. అంటే ముస్లిములు ఒక్క బక్రీద్ పండుగ రోజున దేశంలో 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఖర్చు చేయడమంటే, మార్కెట్లోకి డబ్బు ప్రవహించడం. ఈ 20 వేల కోట్ల రూపాయలు ఎక్కడికి పోయాయి. ఇవి అమెరికాకో, యూరపుకో వెళ్ళలేదు. దేశంలోనే ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రవహించాయి. ఈ డబ్బు ఎక్కడికి వెళ్ళిందంటే గొర్రెలు, మేకలు పెంచే రైతుల వద్దకు వెళ్ళింది. గొర్రెల పెంపకం, మేకల పెంపకం చేసేదెవరు? పట్టణ ప్రాంతాల్లో ఈ వృత్తి కనిపించకపోవచ్చు. మహా అయితే ఒకటి రెండు శాతం అంతకు మించదు. గ్రామీణ ప్రాంతాల్లోనే గొర్రెల, మేకల పెంపకం 98 శాతం జరుగుతుంది. ఈ 20 వేల కోట్ల రూపాయలు ఈ గ్రామీణ పశుపాలకులకు, రైతుల వద్దకు వెళ్ళాయి. నిజం చెప్పాలంటే మారుమూల పల్లెల్లోని పశుపాలకులకు లభించాయి.

గొర్రెలు, మేకలు, పశువులు పెంచేవారెవరు? గణాంకాల ప్రకారం కేవలం 8 శాతం ముస్లిములు ఈ వృత్తిలో కనిపిస్తారు. హిందువుల్లో 80 శాతం పశుపాలన కనిపిస్తుంది. అంటే అర్థమయ్యేది ఏమిటి? 20 వేల కోట్ల రూపాయల్లో 80 శాతం సొమ్ము ముస్లిముల నుంచి హిందూ పశువ్యాపారుల వద్దకు వెళ్ళింది.

కాని రాజకీయ ప్రయోజనాల కోసం బక్రీద్ పండుగపై విద్వేషం వెదజల్లే పార్టీలు, నేతలు ఈ ఆర్థిక ప్రయోజనాలను కూడా అడ్డుకుంటున్నారు.

నిపుణుల అంచనాల ప్రకారం, హజ్, ఖుర్బానీ సందర్భంగా జరిగే కార్యకలాపాల ఆర్థిక ప్రభావం 230 బిలియన్ల డాలర్ల కంటే ఎక్కువ.

హజ్, ఖుర్బానీ మూలంగా ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా వేలాది మందికి ఉపాధి దొరుకుతుంది. ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయి. గ్రామీణ, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలకు సంపద బదిలీ గమనించదగిన అంశం.

బక్రీద్ పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ముస్లిములు ఖుర్బానీ ఇస్తారు. ఖుర్బానీ కేవలం ధార్మిక సంప్రదాయం మాత్రమే కాదు, దానిని ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడే కీలకాంశంగా కూడా చూడాలి.

నిస్సందేహంగా ముస్లిములు ఖుర్బానీ ఒక ఆరాధనగా, దైవప్రసన్నత కోసం ఆచరిస్తారు. కానీ ఇందులో ప్రజాసంక్షేమానికి సంబంధించిన కోణాన్ని కూడా మనం పరిశీలించడం అవసరం. బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ కోసం పశువుల డిమాండ్ పెరుగుతుంది.

డిమాండ్ పెరగడం వల్ల పశుపాలన చేసే రైతులకు ఆదాయం పెరుగుతుంది. ముఖ్యంగా చిన్నతరహా రైతులకు ఇది లాభదాయకంగా మారుతుంది.

గొర్రెల పెంపకాన్ని తెలంగాణ ప్రభుత్వం గతంలో ప్రోత్సహిం

చిందన్నది అందరికీ తెలుసు. గొర్రెల పెంపకం పాలకోసం జరుగుతుందని ఎవరైనా భావిస్తున్నారా? ఈ పశువుల డిమాండ్ పెరగడం గొర్రెల పెంపకం చేసే చిన్న కమతాల రైతులకు లాభదాయకం. ఇది రైతు కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా చేస్తుంది. డిమాండ్ పెరుగుదలను చూస్తే పశుగ్రాసం డిమాండ్ కూడా పెరుగుతుంది. ఇతర ఉత్పత్తి ఇన్‌పుట్‌లకు కూడా డిమాండ్ పెరుగుతుంది.

మరోసారి గుర్తు చేసుకుందాం. దేశజనాభాలో 70 శాతానికి మించి మాంసాహారులే. కాబట్టి కేవలం 14 శాతం మాత్రమే ఉన్న ముస్లిములు మాత్రమే మాంసాహారులన్నట్లు మాట్లాడే వారి మతవిద్వేష వ్యాఖ్యలను పక్కనపెట్టి ఈ విషయాలను పరిశీలించాలి. బక్రీద్ సందర్భంగా మాంసాహార వినియోగం పెరగడం వల్ల దానికి సంబంధించిన మసాలా దినుసుల డిమాండ్ కూడా పెరుగుతుంది. అలాగే ఖుర్బానీ పశువుల రవాణా వల్ల రవాణా సదుపాయాల డిమాండ్ కూడా పెరుగుతుంది. ఆర్థిక కార్యకలాపాలకు తోడ్పడే ఈ అవకాశాల్లో ప్రజలకు ప్రభుత్వం సౌలభ్యం కల్పించడం ఆర్థికాభివృద్ధికి అవకాశమివ్వడమవుతుంది. కాని జరుగుతున్నదేమిటంటే, దీన్ని అడ్డుకునే ప్రయత్నాలు భారీ స్థాయిలో జరుగుతున్నాయి.

బక్రీద్ ఆర్థిక కోణం మాత్రమే కాదు, సామాజిక కోణాన్ని కూడా పరిశీలించాలి. ఖుర్బానీ మాంసాన్ని మూడింట రెండు వంతులు పంచేయడం జరుగుతుంది. ఒక కుటుంబం ఖుర్బానీ ఇచ్చిన పశువు మాంసం 12 కిలోలు లభిస్తే అందులో 8 కిలోలు పంచేస్తారు. ముఖ్యంగా పేదలకు పంచుతారు. దీనివల్ల పేదసాదలకు పోషకాహారం లభించే వాతావరణం ఏర్పడుతుంది.

గొర్రెల పెంపకం, మేకల పెంపకం ఎందుకు చేస్తారు? వాటి అమ్మకాలు కొనుగోళ్ళు ఎందుకు జరుగుతాయి. ఇందులో కేవలం ముస్లిములే ఉన్నారా? మాంసం విక్రేతలు, అది కూడా చిన్నస్థాయి దుకాణాలు మాత్రమే ముస్లిములవి. గొర్రెల పెంపకం, మేకల పెంపకాలు చేసేది ఎక్కువగా ముస్లిమేతరులే. బక్రీద్ సృష్టించే డిమాండ్ వల్ల లాభపడేది వారే. అంటే ఈ పశుపాలనకు బక్రీద్ ప్రోత్సాహాన్నిస్తుంది. ప్రతి సంవత్సరం ఖచ్చితంగా ఉండే డిమాండ్ ఇది. ఖుర్బానీ మార్కెట్ ప్రపంచవ్యాప్తంగా 100 బిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక కార్యకలాపాలకు కారణమవుతుందని ఒక అంచనా. వ్యవసాయం, రవాణా, రిటైల్, ఉత్పాదక రంగాలలో మిలియన్ల మందికి దీనివల్ల జీవనోపాధి లభిస్తుంది.

ఇప్పుడు ఆన్‌లైన్ ఖుర్బానీ సేవలు కూడా వచ్చాయి. మలేషియాలోని **Ez Qurban** వంటి వేదికలు ప్రజలకు ఆన్‌లైన్‌లో ఖుర్బానీ బుక్ చేసుకునే సదుపాయం కల్పించాయి. పశువు కొనడం, ఖుర్బానీ ఇచ్చి, మాంసాన్ని పంపిణీ చేసే దేశాన్ని ఎంచుకోవడం, ఖుర్బానీ పూర్తి చేసినట్లు డిజిటల్‌గా రుజువులు చూపించడం-ఇవన్నీ ఈ వేదికలు సమకూరుస్తున్నాయి. దీనివల్ల ఖుర్బానీ ఇవ్వాలనుకున్న వారికి లాజిస్టిక్స్ బాధ లేకుండా ఖుర్బానీ చేసే సదుపాయం లభించింది. అంతే కాదు, ఖుర్బానీ మాంసం ఏ ప్రాంతం ప్రజలకు పంచాలనుకుంటే అక్కడ పంచే అవకాశం కూడా లభిస్తుంది. ముఖ్యంగా ఇండోనేషియా వంటి దేశాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ డిజిటల్ వేదికల్లో కూడా చాలా మందికి జీవనోపాధి లభిస్తుంది.

ప్రతి సంవత్సరం సౌదీ అరేబియాలో లక్షలాది పశువులు హజ్ యాత్ర సందర్భంగా ఖుర్బానీ అవుతుంటాయి. హజ్ యాత్రలో లేనివారు కూడా బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీ ఇస్తుంటారు. ఈ మాంసాన్ని ఏం చేస్తారని చాలా మంది ఆలోచించవచ్చు.

ఇటీవల టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఒక వ్యాసం వచ్చింది. హుస్సేన్ అహ్మద్ అనే పారిశ్రామికవేత్త గురించిన వ్యాసం. ఆయన ఒకసారి ఎమన్ వెళ్ళాడు. అక్కడి పేదరికాన్ని చూశాడు. ఆకలి కడుపులతో నిద్రపోక తప్పని పరిస్థితిని చూసి చలించిపోయాడు. ఆ వెంటనే ఒక స్వచ్ఛంద సేవాసంస్థను స్థాపించి ఖుర్బానీ మాంసాన్ని ఆఫ్రికాలోని ఎమన్, సోమాలియా, సూడాన్, ఇథియోపియా తదితర దేశాల్లోని పేదలకు పంపిణీ చేయడం ప్రారంభించారు.

హజ్ యాత్రలో ఖుర్బానీ అయ్యే లక్షలాది పశువుల మాంసం కూడా ఇలాగే పంపిణీ అవుతుంది. సౌదీ అరేబియా ఇందుకోసం అదాహి ప్రాజెక్టు నడుపుతోంది. ఖుర్బానీ మాంసాన్ని ప్రాసెస్ చేసి, స్టోర్ చేసి, దేశవిదేశాల్లోని పేదలకు పంచడానికి పంపుతుంటారు.

బక్రీద్ సందర్భంగా చర్చించవలసిన కోణాలు చాలా ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక్క బక్రీద్ పండుగ వల్ల మార్కెట్లో ఎంత డబ్బు ప్రవహిస్తుంది? ఆ డబ్బు ఎవరి వద్దకు వెళుతుంది? ఈ లెక్కలు తీస్తే ఈ డబ్బు ఎక్కువగా ముస్లిమేతరుల వద్దకే వెళుతుందని, మార్కెట్లో నగదు ప్రవహించడానికి బక్రీద్, రమజాన్ వంటి పండుగలు ఎంతో తోడ్పడుతున్నాయని అర్థమవుతుంది.

కాని విద్వేష రాజకీయాలు చేసేవారికి కేవలం విద్వేషమే ముఖ్యం. దేశ ఆర్థిక ప్రగతితో వారికి ఏమి సంబంధం? ✤



## ముస్లిం సామాజిక వర్గానికి మరోసారి 'మొండిచెయ్యి'

# మంత్రి పదవి ఎండమావేనా?

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

ఎట్టకేలకు తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ విస్తరణ జరిగింది. ముగ్గురు కొత్త మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. ఇది అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మరో ముందడుగు. అయితే ఈ సంతోషకరమైన పరిణామం వెనుక కొన్ని అసహజ, అసమాన అసమర్థవంతమైన నిర్ణయాల రూపం స్పష్టంగా కనిపిస్తోంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ రెండవ విడత మంత్రివర్గ విస్తరణలో కూడా ముస్లింలకు పూర్తి నిరాశనే మిగిల్చింది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి, దాదాపు ఇరవై నెలలపాటు ముస్లింలకు మంత్రివర్గంలో ఒక్క స్థానమూ ఇవ్వకుండా ప్రభుత్వం కొనసాగుతోంది. ఇప్పటికి మొత్తం 15 మంది మంత్రులు నియమితులయ్యారు. వీరిలో ముస్లిం సామాజిక వర్గంనుండి ఒక్కరికీ అవకాశం కల్పించకపోవడం అత్యంత శోచనీయం. రాజకీయంగా దివాళాకోరుతనం.

ఇక్కడ అధికార పక్షం వినిపిస్తున్న వంక ఒకటుంది. ముస్లిం ఎమ్మెల్యేలు ఎవరూ గెలవలేదు కనుక మంత్రి పదవులు ఎలా ఇవ్వాలి? అని.  ఈ వాదన ముందుకు తెస్తున్నవారు ఒక్కసారి గత ప్రభుత్వాన్ని చూడాలి. 2014లో ప్రత్యేక తెలంగాణ మొదటి క్యాబినెట్ ఏర్పాటైన వేళ కూడా కేసీఆర్‌కు ఇదే సమస్య ఎదురైంది. ముహమ్మద్ మహమూద్ అలీ అప్పుడు ఎమ్మెల్యే కాదు, అయినప్పటికీ ఆయనకు ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు రెవిన్యూ మంత్రిత్వ శాఖను కూడా ఇచ్చారు. ఈ వెసులుబాటు రాజ్యాంగబద్ధంగా అందుబాటులో ఉన్నప్పుడు 'ఎవరూ లేరు' అన్న కారణం సహేతుకం కాదు. అది కేవలం తప్పించుకునే సాకు మాత్రమే.

తెలంగాణ రాష్ట్రంలో ముస్లిం  జనాభా దాదాపు 14 శాతం. గణనీయమైన ఓట్ల శాతం కలిగిన ముస్లిం సామాజిక వర్గం గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకమైన మద్దతును అందించింది. అప్పటి రాజకీయ పరిణామాల కను

గుణంగా కేసీఆర్ ఒంటెద్దు పోకడలకు వ్యతిరేకంగా, భా. జ. పాతో లోపాయికారీ ఒప్పందం ఫలితంగా ముస్లిం, ముస్లిమేతర మేధావివర్గం, ధార్మిక సంస్థలు, మహిళలు, యువత అందరూ కాంగ్రెస్ అభ్యర్థులకు తిరుగులేని మద్దతు ప్రకటించారు.

శ్రీ రేవంత్ రెడ్డి సయితం ముస్లిం మైనారిటీ ప్రముఖులతో, సంస్థలతో సమావేశమై మద్దతుకై అభ్యర్థించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెలకొన్న అసంతృప్తిని కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మలచడంలో ముస్లింల పాత్ర గణనీయమైనది. కానీ 'ఓడ దాటిందాక ఓడమల్లయ్య...' అన్నట్లు గెలిచిన వెంటనే కాంగ్రెస్ పార్టీ ముస్లిం వర్గాన్ని విస్మరించింది.

ముక్కు కోసినా ముందు మగడే మేలన్న సామెతను కాంగ్రెస్ పార్టీ మరోసారి గుర్తు చేసింది.

ఇప్పటి వరకు నియమితులైన మంత్రుల్లో లంబాడా సామాజిక వర్గానికీ ప్రాతినిధ్యం లభించలేదు. డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చి ఆ వర్గానికి కొంత ఉపశమనం కలిగించినా, ముస్లింలకు మాత్రం అలాంటి కనీస గౌరవం కూడా లభించలేదు. నిజానికి రాజకీయ ప్రాతినిధ్యం అనేది కేవలం ఏదో ఒక హెూదాకు పరిమితమయ్యే అంశం కాదు. అది పాలనలో భాగస్వామ్య అవకాశం. పాలనా నిర్ణయాలలో పాలుపంచుకునే స్థాయికి తీసుకెళ్లే పదవులు కల్పించినప్పుడే, సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుంది.

పైన చెప్పుకున్నట్లు, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉప ముఖ్య మంత్రి, హెూంమంత్రి, రెవెన్యూ మినిష్టర్ వంటి కీలక పదవులు మైనారిటీ వర్గానికి దక్కాయి. అవి అలంకార ప్రాయమైన పదవులని ఎవరైనా అంటే అనవచ్చు. అది వేరే విషయం. మైనారిటీ సంక్షేమ బడ్జెట్లో కూడా భారీ కేటాయింపులే జరిగాయి. రెండు వందలకు పైగా మైనారిటీ గురుకులాలూ గొప్ప విషయమే. కానీ ఇప్పటి ఈ పద్దెనిమిది నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో అలా చెప్పుకోడానికి పెద్దపెద్ద పద్దులేమీ కనబడడం లేదు. ఇది ప్రజలలో తీవ్ర అసంతృప్తికి దారి తీస్తోంది. ఒకవేళ రాజకీయ పార్టీలు మాకు ముస్లింల ఓట్లు మాత్రమే కావాలి, నాయకత్వ స్థాయి, పదవులు మాత్రం ఇవ్వమన్న రీతిలో ప్రవర్తిస్తే, అది మైనారిటీలకే కాదు, ప్రజాస్వామ్యానికీ నష్టమే. ప్రతి సామాజిక వర్గానికీ తగిన ప్రాతినిధ్యం కల్పిస్తానని ఎన్నికలకు ముందు హామీలు గుప్పించి, గెలిచిన తరువాత మౌన వ్రతం పాటించడం పట్ల ఆయా వర్గాలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. 'ముస్లింలకు ఓటు హక్కు ఉంది కానీ పాలనా హక్కు లేదా?' అని యువతరం నిలదీస్తోంది.

**ఇప్పటి వరకు నియమితులైన మంత్రుల్లో లంబాడా సామాజిక వర్గానికీ ప్రాతినిధ్యం లభించలేదు. డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చి ఆ వర్గానికి కొంత ఉపశమనం కలిగించినా, ముస్లింలకు మాత్రం అలాంటి కనీస గౌరవం కూడా లభించలేదు. నిజానికి రాజకీయ ప్రాతినిధ్యం అనేది కేవలం ఏదో ఒక హెూదాకు పరిమితమయ్యే అంశం కాదు. అది పాలనలో భాగస్వామ్య అవకాశం. పాలనా నిర్ణయాలలో పాలుపంచుకునే స్థాయికి తీసుకెళ్లే పదవులు కల్పించినప్పుడే, సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుంది.**

ఈ పరిస్థితి తెలంగాణకే ప్రత్యేకమైనది కాదు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సహా అనేక పార్టీలు ముస్లింల ప్రాతినిధ్యాన్ని గణనీయంగా తగ్గిస్తున్నాయి. భా.జ.పా గురించి అసలు మాట్లాడక పోవడమే మంచిది. 18 వ లోక్‌సభలో మొత్తం 543 మంది సభ్యులుంటే, ముస్లింలు కేవలం 24 మంది. అంటే సుమారు 4.4% మాత్రమే. అభ్యర్థుల ఎంపికలో ముస్లింలను విస్మరించడమే ఇందుకు నిదర్శనం. ఇది కేవలం రాజకీయ పతనం మాత్రమే కాదు, అది ఆ సామాజిక వర్గ నమ్మకాన్ని వమ్ము చేయడం కూడా.!

ముస్లిం సమాజం ప్రతిసారీ తన బాధ్యతను గుర్తెరిగి ఓటు హక్కును వినియోగిస్తోంది. కానీ ప్రతిఫలంగా పాలనా బాధ్యతల్లో పాలుపంచుకోలేని నిస్సహాయతకు గురవుతోంది. ఇది మైనారిటీల పట్ల అన్యాయం మాత్రమే కాదు, సమానత, న్యాయం అనే రాజ్యాంగ విలువలనే ప్రశ్నార్థకం చేసే ధోరణి.

కనుక ఇప్పటికైనా తెలంగాణ కాంగ్రెస్ స్పందించాలి. మిగిలిన చివరి మంత్రివర్గ విస్తరణలో అయినా ముస్లింలకు గౌరవప్రదమైన పదవులు కల్పించాలి. పాలనలో భాగస్వామ్యాన్ని కల్పించడం కాంగ్రెస్ పార్టీ నైతిక బాధ్యత. ఎందుకంటే, ఇక ముస్లింలు మౌనంగా ఓటు బ్యాంకుగానే మిగిలిపోడానికి సిద్ధంగా లేరు. ఈసారి ముస్లింల మౌనం హక్కుల సాధనకు, రాజకీయ ప్రాతినిధ్యానికి అవసరమైన పోరాటానికీ దారితీయవచ్చు.

రాజకీయ పార్టీలు ఈ సంకేతాలను సకాలంలో అర్థం చేసుకోవాలి. అభివృద్ధి, సమానత, న్యాయమనే భావజాలాన్ని కేవలం మాటల్లో కాకుండా, చేతల్లోనూ నిబద్ధతతో అమలు చేయాలి. అప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది. లేకపోతే సామాజిక సమతౌల్యం దెబ్బతినడం ఖాయం.

# మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి)

5/2

**ఎస్.ఎమ్. మలిక్**

## 2. విశ్వసనీయత

### తొలి ఖలీఫా కాలంలో

మహనీయ అబూ బక్ర్ సిద్దీక్ ఖిలాఫత్ కాలంలో మహనీయ తల్హా ఖలీఫాకు సన్నిహిత సలహాదారుగా వ్యవహరించారు. తన ఆలోచనలు, సలహాలు, తోడ్పాటు ద్వారా సహాయ పడుతూ ఉన్నారు. ప్రతి సమస్యలోనూ, ప్రతి దశలోనూ పూర్తి సహకారాన్ని అందజేశారు. రాజ్యంలో ధర్మ భ్రష్టత చెలరేగిన సందర్భంలో సహచర మాన్యులు అధికంగా జకాత్ చెల్లించని వారి పట్ల తాత్కాలికంగా చూపోపు వహించి సడలింపు ఇవ్వవలసిందని సలహా ఇచ్చారు. కాని మహనీయ తల్హా దాన్ని గట్టిగా వ్యతిరేకించారు. ఖుర్‌ఆన్ వచనాలను ఉదాహరించి వాదించారు.

హిజ్రీ 13వ సంవత్సరం ఖలీఫా మహనీయ అబూ బక్ర్(ర)కు జ్వరం వచ్చింది. ఒకరోజు ఆయన్ని పరామర్శించడానికి మహనీయ తల్హా(ర) వెళ్ళారు. మహనీయ అబూ బక్ర్ సిద్దీక్(ర) అతి తీవ్రంగా బలహీనులవుతున్నారు. పరామర్శ అయిన తరువాత కాస్సేపటికి ఖలీఫా, "నేను ఉమర్‌ని నా తరువాత ఖలీఫాగా ప్రతిపాదించాలని అనుకుంటున్నాను, మీ సలహా ఏమిటి?" అని అడిగారు.

దానికి మహనీయ తల్హా, "సహచరులందరిలో ఉత్తమ గుణ సంపద కలవారు, సత్యాసత్యాల్లో విచక్షణని చూడగలవారు ఆయన" అని బదులిచ్చారు.

"నేను నా తరువాత నా స్థానంలో ఆయన్ని నియమించడం పట్ల మీ సలహా కోరుతున్నాను" అని అన్నారు ఖలీఫా.

"ఆయన నైజంలో కాఠిన్యం ఉంది. ఆయన అధికంగా తప్పు పడుతుంటారు" అన్నారు తల్హా.

"ఇందులో తప్పేముంది?" అడిగారు ఖలీఫా.

"మీ ఖిలాఫత్ కాలంలోనే ఆయన ఇంతగా కాఠిన్యం ప్రదర్శిస్తే, మీ తరువాత బాధ్యతా భావం వల్ల మరెంతగా కాఠిన్యం వహిస్తారో?" అని తన సంశయం వెలిబుచ్చారు మహనీయ తల్హా.

"ఖిలాఫత్ భారం పడగానే ఆయన మార్దవం వహిస్తారు.

నిజానికి నేను మెతక వైఖరి వహిస్తానని ఆయన కాఠిన్యం చూపుతున్నారు ఇప్పుడు'' అన్నారు మహనీయ అబూ బక్ర్(ర).

దానికి మహనీయ తల్హా,''నేను ముందే చెప్పాను, ఆయనలో ఎన్నో ఉత్తమ గుణాలున్నాయని, నేను మీతో విభేదించడం లేదు. నా దృష్టిలో ఉన్న ఆయన నైజంలోని మరో కోణాన్ని మరుగు పరచలేను కదా'' అని వివరించారు మహనీయ తల్హా(ర).

## సత్యం సదా తన ఆయుధంగా

మహనీయ ఉమర్(ర) ఖిలాఫత్ బాధ్యత స్వీకరించిన తరువాత ఆయన కూడా మహనీయ తల్హా(ర)కు తగిన స్థానం కల్పించారు. చిత్తశుద్ధితో ఆయన ఇచ్చే సలహాల ద్వారా, ఆయన సామర్థ్యాల ద్వారా పూర్తిగా ప్రయోజనం పొందారు.

ఇరాక్ స్వాధీనం అయిన తరువాత ఒక చర్చ ముందుకు వచ్చింది. యుద్ధ ప్రాప్తి వలె ఇరాక్‌లోని వ్యావసాయిక భూముల్ని సయితం, తమ ప్రాణాలను పణంగా పెట్టి జయించిన సేనలో విభజించ వలెనా? అన్న ప్రశ్న తలెత్తింది. మహనీయ ఉమర్(ర), వాటిని ప్రస్తుత కర్షకులకే ఇచ్చి వాటి మీద పన్ను, వాటి ఆదాయం మీద ఉష్ర్(పదవ వంతు) జకాత్, కప్పం వసూలు చేయాలని అభిప్రాయపడ్డారు. ఈ విషయం పైన చర్చకు సలహామండలి సమావేశం జరిగింది. అప్పుడు మహనీయ తల్హా, మహనీయ ఉమర్ అభిప్రాయంతో ఏకీభవిస్తూ ఘాటుగా ఆధారాలతో సహా ప్రసంగించారు. అంతే, ఏకాభిప్రాయంతో ఆ ప్రతిపాదన పాసయింది.

ఆ తరువాత మహనీయ ఉమర్(ర) సలహామండలిని అడిగారు, ఆ భూముల మషాయతు చేసి వాటి పన్నులు గట్రా నిర్ణయించే బాధ్యత ఎవరికి అప్పజెప్పాలో సలహా ఇవ్వవలసిందని. దానికి కూడా మహనీయ తల్హా (ర) ముందుకు వచ్చి ఉస్మాన్ బిన్ హనీఫ్ పేరు సూచించారు. ''ఆయనలో ఇంతకన్నా బరువు బాధ్యత కూడా నిర్వహించగల సామర్థ్యం ఉంది'' అని చెబుతారు. ఈ ప్రతిపాదనను ఇంకా కొందరు పెద్దలు కూడా సమర్థించారు. తదనుగుణంగా మహనీయ ఉస్మాన్ బిన్ హనీఫ్ నియామకం జరిగింది.

మరో సందర్భంలో సలహామండలి సమావేశంలో అన్ని విధాల పన్నుల నిర్ణయం చర్చకు వస్తుంది. మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ఒక ప్రతిపాదన చదివి వినిపిస్తారు. మహనీయ తల్హా అందులో కొన్ని సవరణలు సూచిస్తారు, ఆ పైన పన్నుల జాబితా రూపొందుతుంది.

## ఖిలాఫత్‌కు తగినవారు

అమీరుల్ మూ'మినీన్ మహనీయ ఉమర్(ర) తన మృత్యువుకు పూర్వం ఆరుగురు సహచర మాన్యులను పేర్కొని వారు తమలో ఒకరిని ఖలీఫాగా ఎన్నుకోవాలని సూచిస్తారు. వారిలో మహనీయ తల్హా కూడా ఉన్నారు. మహనీయ తల్హా(ర) ఖిలాఫత్ కొరకు మహనీయ ఉస్మాన్(ర) పేరు ప్రతిపాదిస్తారు. కడకు మహనీయ ఉస్మాన్‌నే ఎన్నుకుంటారు ఖలీఫాగా.

మహనీయ ఉస్మాన్(ర) ఖిలాఫత్ అంతిమ దశలో ఇస్లామ్ విరోధ శక్తులు మహనీయ ఉస్మాన్(ర) ఇంటిని చుట్టుముట్టిన సందర్భంలో ఒక రోజు మహనీయ ఉస్మాన్ తన కిటికీ నుంచి, అక్కడ గుమిగూడిన జనాన్ని సంబోధించారు. అప్పుడు ఆయన, ''జనులారా! మీలో తల్హా ఉన్నారా?'' అని అడిగారు. ఏ సమాధానం రాలేదు. అలా మూడవ సారి కేక వేసినప్పుడు మహనీయ తల్హా(ర) లేచి నిలబడ్డారు. అప్పుడు మహనీయ ఉస్మాన్(ర), ''మీరు ఈ గుంపులో ఉంటారని, మూడు సార్లు కేక వేస్తే పలుకుతారని నేను ఆశించ లేదు'' అని చెప్పి ఓ సంఘటనను గుర్తు చేస్తారు.

''ఆ సందర్భంలో దైవ సందేశహరుల వెంట నేనూ మీరు తప్ప ఎవరూ లేరు. అప్పుడు ప్రవక్త(శ్రీ(స) మిమ్మల్ని సంబోధించి, 'తల్హా! స్వర్గంలో ప్రతి ప్రవక్తకు అతని సముదాయంలోని ఒక వ్యక్తి తోడుగా ఉంటాడు. ఈ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ నాకు తోడుగా ఉంటాడు' అని చెప్పారు, గుర్తుందా?'' అని అడిగారు. దానికి మహనీయ తల్హా, ''అవును నిజమే'' అని బదులిచ్చి అక్కడి నుండి వెళ్ళిపోయారు.

## పశ్చాత్తాపం

విశ్వాసుల మాతృమూర్తి మహనీయ ఆయిషా(ర), మహనీయ జుబైర్(ర)లతో కలసి మహనీయ ఉస్మాన్(ర) హంతకుల అణచివేత కొరకు బస్రా వచ్చినప్పుడు చాలా చింతాగ్రస్తులయి ఉండేవారు. ఎవరయినా అడిగితే ఎంతో బాధతో ఇలా చెప్పేవారు,

''గుర్తుకు వస్తూ ఉంటుంది, ఒకప్పుడు మేమంతా శత్రువు

లకు ఎదురుగా సమైక్యంగా, పరస్పరం శ్రేయోభిలాషులంగా, సానుభూతి పరులంగా ఉండేవారము. ఇప్పుడు పరిస్థితి ఈ విధంగా రూపొందింది. నా అంతరాత్మ నన్ను మేల్కొలుపు తోంది, మహనీయ ఉస్మాన్(ర) విషయంలో పొరపాటు జరిగింది. దాని చెల్లుబాటుకు ఒకటే మార్గం, ఆయన రక్తపరి హారం కొరకు నిలబడటం, అవసరం అయితే అందులోనే ప్రాణం అర్పించుకోవడం.''

కా'కా' బిన్ అమ్ర్ రాయబారం వల్ల అపోహలు దూరమయి, పరిస్థితులు చక్కబడే మార్గం సుగమమయింది. దాని మీదట మహనీయ అలీ(ర), విశ్వాసుల మాతృమూర్తి మహనీయ ఆయిషా(ర), మహనీయ తల్హా(ర), మహనీయ జుబైర్(ర) ప్రభృతుల మధ్య ఏకాభిప్రాయం కుదిరే ప్రాతిపదికలు నిర్ణయమయ్యాయి. ఇరు పక్షాలు తృప్తిగా ఊపిరి పీల్చు కున్నాయి. ఆ రోజు బాగా చీకటి పడి జనం ఎక్కడి వారక్కడ నిద్రపోయారు.

తరువాత కొంత సేపటికి యూదుల సబాయీ వర్గం మహ నీయ ఆయిషా సమర్థకుల పైన, మరోవైపున మహనీయ అలీ సమర్థకుల పైన దాడి చేశారు. అటు మహనీయ ఆయిషా సమర్థకులకు మహనీయ అలీ వర్గం వారు దాడి చేశారని, ఇటు మహనీయ అలీ వర్గీయులకు మహనీయ ఆయిషా సమర్థకులు దాడి చేశారని పుకార్లు లేవ నెత్తారు. సబాయీల ఈ వంచనా శిల్పం వల్ల జరగవలసింది జరి గింది. తెల్లవారు జాము వరకు తీవ్రమయిన యుద్ధం ఆరంభ మయింది. అందులో ఇరు వర్గాల పదివేల మంది హతు లయ్యారు.

## చివరి ఘడియలు-అమరగతి

హిజ్రీ 36వ సంవత్సరం ఆ యుద్ధం ప్రారంభం అయింది, చరిత్రలో ఈ యుద్ధాన్ని జమల్ (ఒంటెల) యుద్ధం అంటారు. యుద్ధం ప్రారంభంలోనే ఒక బాణం మహనీయ తల్హా(ర) కాల్లో వచ్చి గుచ్చుకుంది. ఆ గాయం నుంచి రక్తం ధారా పాతంగా కారసాగింది. మహనీయ అలీ సేనలో ఒక కమాండర్, కా'కా' బిన్ అమ్ర్, ఆయన్ని, రక్తం బాగా కారడం వల్ల యుద్ధం నుంచి విరమించుకుని బస్రా వెళ్ళి విశ్రమించమని సలహా ఇచ్చారు. తదనుగుణంగా మహనీయ తల్హా నౌకరు ఆయన్ని బస్రాలో ఓ ఆసుపత్రిలో చేర్పించారు. అప్పుడు ఆయన అపస్మారక స్థితిలో ఉన్నారు. శరీరంలోని రక్తమంతా కారి పోయింది. కాస్సేపటిలోనే అసువులు బాసారు. బస్రాలోనే ఖననం జరిగింది.



# మన సమయం ఎటు పోతుంది?

మంగళగిరి జీలాని

ప్రతి ఒక్కరికీ రోజుకు 24 గంటలే. ఒక సర్వే ప్రకారం రోజుకు సగటున ప్రతి వ్యక్తి 6-8 గంటలు నిద్రకు, 8 గంటలు పనులకు, 2 గంటలు తినేందుకు, 2 గంటలు ప్రయాణంలో, ఒక గంట కాలకృత్యాలకు వినియోగిస్తాడు అని తెలిసింది. మిగిలిన కొద్దిపాటి (3 గంటలు) సమయాన్ని ఎలా గడుపు తున్నాం అనేది అత్యంత ముఖ్యం. కాలాన్ని ఖర్చు చేయడం అంటే జీవితాన్ని ఖర్చు చేయడమే అని మనం తెలుసుకోవాలి.

''ఒకప్పుడు నేను కాలాన్ని నాశనం చేశాను. కాలం ఇప్పుడు నన్ను నాశనం చేస్తోంది'' అన్నాడు షేక్స్‌పియర్.

దాదాపుగా వారంలోని అన్ని రోజులు ఇలాగే గడిచిపోతాయి. మరి ఆదివారం సెలవు కదా! అది ఎలా గడుపుతున్నాం అనేది ఆలోచించారా? కొందరికి శని, ఆదివారాలు సెలవులే. ఆఫీసు పని లేదా ఇతర పనులు ఉండవు. ఆ సమయం అంతా మనకు నచ్చినట్టుగా సద్వినియోగపరచుకునే అవకాశం ఉంది. కొన్ని చిన్నపాటి అస్వస్థతలు, రోగాలు అనుకోని అతిథులు వలే వస్తుంటాయి. వాటి కోసం కొంత సమయం కేటాయించాలి కదా! దీనికొరకు వారానికి అయిదు గంటల సమయం వృథా అవుతుందని మరో సర్వే తెలిపింది.

పూర్వం టీవీ, సినిమాల కొరకు సమయం, ఇప్పుడు స్మార్ట్ ఫోన్ల కొరకు కేటాయించే సమయం ఎంత ఎక్కువో కదా! మనం కాలాన్ని జాగ్రత్తగా సద్వినియోగపరచుకో లేకపోతే అది కూడా వృథా అవుతుంది. సమయాన్ని వృథా చేయడం అంటే జీవితాన్ని వృథా చేసుకోవడమే. సక్రమమైన సమయ నిర్వహణ (టైమ్ మేనేజ్‌మెంట్) వల్ల మనకు నచ్చే, మనసుకు ప్రశాంతతనిచ్చే మంచి కార్యాలను చేసుకోవచ్చు.

తీర్పుదినాన అల్లాహ్ న్యాయస్థానంలో మనిషి అయిదు విషయాల లెక్క అప్పజెప్పనంతవరకు అక్కడి నుండి కదల లేడు. అతనిని అడిగే ప్రశ్నలలో 'జీవిత కాలాన్ని ఏ కార్యకలా పాల్లో గడిపావు?' అనేది ఒక ప్రశ్న. దీనికి సమాధానం మన దగ్గర ఉందా? ఆలోచించండి. ఆచరణకై అడుగులు వేయండి.


'చరితార్థులు'-2



# అబ్దుల్ కరీం లుంజీ

## (..... -1969)

**84**



**భారతీయుల** అపూర్వ త్యాగాలు, అద్వితీయ పోరాటాల ప్రతిఫలంగా ఆంగ్లేయుల ఉక్కు పిడికిలి నుండి ఇండియాకు విముక్తి లభించిన చారిత్రాత్మక ప్రకటనకు సంబంధించి బ్రిటిష్ వైశ్రాయి విడుదల చేసిన అధికారిక పత్రాలలోని 450 మంది ప్రముఖులతో పాటుగా తన పేరును నమోదు చేసుకున్న అదృష్ట వంతులు అబ్దుల్ కరీం లుంజీ. మహా రాష్ట్రలోని షోలాపూర్‌లో ప్రఖ్యాత లుంజీ కుటుంబంలో ఆయన జన్మిం చారు. పదవ తరగతి వరకు చదువు కున్న కరీం లుంజీ షోలాపూర్‌లోని ఒక కాటన్ మిల్లులో 150 రూపాయల జీతంతో ఉద్యోగం చేశారు. మహాత్మా గాంధీ అహింసాయుత పోరాటం పట్ల ఆకర్షితులైన ఆయన డాక్టర్ కె.యం. అంత్రోలికార్ సహచర్యంలో భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమంతో ఆరంభించి జాతీయోద్యమ కార్యక్రమాలకు పూర్తి స్థాయిలో అంకిత మయ్యారు. ప్రజలను ఉత్తేజితుల్ని చేసి, సమీకరించడం, సభలు–సమావేశాలు లాంటి కార్యక్రమాల ద్వారా బ్రిటిష్ వ్యతిరేకతను ప్రజలలో పెంచసాగారు. ఆయనను నిలువ రించేందుకు ఆంగ్లేయాధికారులు ఆయన ఉద్యోగాన్ని ఊడ బెరికించారు. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టినా ఆయన ఏ మాత్రం వెరవలేదు. యువతను ఆకర్షించే విధంగా కార్య క్రమాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతున్న కరీం లుంజీని అరెస్టు చేసిన ప్రభుత్వం రెండు సంవ త్సరాల జైలుశిక్షకు గురిచేసింది. 1932లో 'ఆజాద్' దినపత్రికను ఆరంభించి ఆంగ్లేయ దుశ్చర్యలను వెల్లడి చేస్తూ యువత ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఆంగ్ల ప్రభుత్వ దాడులకు తట్టుకుని ఆర్థికంగా నిలదొక్కుకోలేక పత్రికకు స్వస్తి చెప్పారు. జాతీయ భావా లను ప్రచారం చేస్తున్న ఇతర పత్రిక లకు ప్రతినిధిగా ఉద్యమ కార్యక్రమాల ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసారు. 1938లో చైనా మీద జపాన్ దాడి చేసిన సందర్భంగా భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు చైనా ప్రజలకు వైద్యసేవలు అందించడానికి డాక్టర్ ద్వారకానాధ్ కొట్నీస్ వెళ్ళారు. ఆ సందర్భంగా అవసరమగు సరం జామా సమకూర్చడంతోపాటు ఘనంగా వీడ్కోలు సభను ఏర్పాటు చేసి కరీం లుంజీ ప్రజల మన్నన పొందారు. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆయన షోలాపూర్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి నిర్బంధానికి గురయ్యారు. ఇండియాకు స్వాతంత్ర్యం లభించాక నిజాం సంస్థానం మీద సాగిన భారత సైనిక చర్య వలన ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, కడగండ్లను స్వయంగా చూసిన కరీం లుంజీ ప్రజల వెతలను ప్రధాని నెహ్రూ దృష్టికి తెచ్చి బాధితులకు సహాయం, పునరావాస కార్యక్రమాలను చేపట్టారు. స్వతంత్ర భారతావనిలో ప్రజల పక్షంగా చివరి వరకు సేవలందించిన 'ప్రజల మనిషి' అబ్దుల్ కరీం లుంజీ 1969 మే ఆరున షోలాపూర్‌లో తనువు చాలించారు. ✤




**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



# పెళ్లి సంబంధాలు

ముహమ్మద్ హనీఫ్, మార్కాపురం

**ప్రపంచంలో ఏ సంప్రదాయమైనా,** ఏ మతం అయినా, ఏ జాతి అయినా, ఏ కులం అయినా కన్నపేగు మమకారంలో ఎలాంటి లోటు ఉండదు. తల్లిదండ్రుల ఆప్యాయత, దయాగుణం, ప్రేమ, అనురాగం, పిల్లలు పెంచే విషయంలో ఎలాంటి లోటు గానీ, లోపం కాని స్వార్థం కాని ఏ కోశానా వారికి వుండదు. తమ పిల్లల గురించి అహర్నిశలు కష్టపడి ఉన్నత విద్య చదివిస్తారు. మేమ ఎలాగో చదువుకోలేక పోయాము. మా పిల్లలకు అలా జరగకుండా వుండాలి అని మంచి చదువులు చదివిస్తారు. వారు తమ పిల్లలను ప్రయోజకులు చెయ్యటానికి చాలా కష్టపడతారు. అమ్మాయిగాని యుక్త వయసుకు వచ్చింది అంటే అప్పటి నుంచి పెళ్ళి సంబంధాలు వెతకడం మొదలవుతుంది. పెళ్ళి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు తల్లిదండ్రులు. నాకు కాబోయే భార్య అందంగా ఉండాలి, ఎర్రగా వుండాలి అని అబ్బాయి మనసులో కోరిక వుంటుంది. అమ్మాయి తరపు వాళ్ళు అబ్బాయి గురించి వారికి సొంత ఇల్లు ఉందా, క్యాష్ ఏమన్నా ఉన్నదా. ఆస్తులు ఎన్ని ఉన్నాయి, వారి ఇంట్లో ఎంత మంది అన్నలు, చెల్లెళ్లు ఉన్నారు. అతనికి ఉద్యోగం ఉన్నదా?... అమ్మాయి తల్లిదండ్రులు పలు విధాలా ఆలోచన చేసే కాలం ఇది. పెళ్ళి అంటేనే ఇరువురికి నచ్చే విధంగా మసలుకోవాలి. వధువుకు వరుడు నచ్చాలి, వరుడుకి వధువు నచ్చాలి. వధూవరులకు వారు నచ్చిన విధంగా పెళ్ళి సంబంధం కుదురుతుంది. పెళ్ళి ఎంతో వైభవంగా చేస్తారు, ఇరువురి ఇంట్లో సంతోషాలు, శుభకార్యాలు జరిగిపోతాయి.

భార్యాభర్తల అనుబంధం ఆప్యాయత, ప్రేమ అనురాగాలతో హ్యాపీగా జీవితం సాగిపోవాలి అని దీవిస్తారు. ఆలుమగలు అంటేనే బంధం, అనుబంధం, ఆప్యాయత, సంసారం అన్నాక మధ్యలో అక్కడక్కడ అర్థం చేసుకోవటంలో, కోపతాపాలు

ఉంటాయి. ఒకరినొకరు అర్థం చేసుకుని జీవించాలి. భార్యాభర్తల మధ్య సహజంగా ప్రేమానురాగాలతో కూడిన శృంగారం ఫలితంగా కలగాల్సిన సంతానం ఇప్పుడు కెరీర్ ప్రణాళికలో ఒక భాగమై సరైన సమయం కోసం వేచి చూడాల్సి వస్తోంది.

సాధారణంగా ముప్పై ఏళ్ల లోపే సంతాన సాఫల్యత ఎక్కువగా ఉంటుంది. ఆ తర్వాత ఏటికేడాది తగ్గిపోతుంది. చదువులు పూర్తై ఉద్యోగాల్లో స్థిరపడి కొన్నాళ్ళు ఆనందంగా గడిపిన తరువాత భార్యాభర్తలిద్దరూ వేర్వేరు షిఫ్టుల్లో పని చేయడం, విదేశీ ప్రయాణాలు, ఉద్యోగాల్లో చేరుకోవాల్సిన లక్ష్యాలు అన్నీ చూసుకుని చివరికి పిల్లల్ని కనడానికి సిద్ధమయ్యే సరికి పోయిన కాలం తిరిగి రాదు. గడిచిపోయిన కాలం మళ్ళీ రాదు. సంతాన లేమికి జన్యుపరమైన సమస్యలు కొంత కారణం కావచ్చు. 35 ఏళ్లు దాటితే ఆ తరువాత గర్భం రావడం కష్టమవుతుంది. పత్రికల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ దీన్నే ప్రామాణికంగా చెబుతుంది. పురుషుల్లో ప్రధానంగా జీవనశైలి సమస్యలు సంతాన సామర్థ్యాన్ని తగ్గిస్తున్నాయి. వీర్య కణాల సంఖ్య తగ్గిపోతుంది. ముప్పై ఏళ్ళ క్రితం వరకు మి.లీ వీర్యంలో 80-100 మిలియన్ల వరకు శుక్ర కణాలు ఉండేవట. ఇప్పుడు అవి 30-40 మిలియన్లకు తగ్గిపోయాయి. కాని వాస్తవంగా ఈ స్థాయిలో ఉంటే గర్భం దాల్చే అవకాశాలు తగ్గిపోతాయి అంటున్నారు. పొగతాగే వారిలో స్పెర్మ్ కౌంట్ 17శాతం తగ్గుతుంది. శుక్ర కణాల నాణ్యత తగ్గుతుంది. కేవలం 30శాతం మందిలోనే ఇవి ఆరోగ్యంగా ఉంటున్నాయట. మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనాల ప్రభావం దానికి కారణం.

కుటుంబ సామాజిక వాతావరణం ఒత్తిళ్ళు, ఆహారపు అలవాట్లు, ఆ సమస్యను పెంచుతున్నాయి. 40 శాతం స్త్రీలు, 40 శాతం పురుషులు ఈ సమస్యకు కారణం అవుతున్నారు. మిగిలిన దాంట్లో కొంత ఇద్దరి పాత్ర ఉండవచ్చు. మహిళల విషయంలో అండాల సంఖ్య తగ్గడం సంతాన లేమికి ప్రధాన కారణం. గతంలో 40ఏళ్ళు వచ్చేసరికి తగ్గే అండాల సంఖ్య ఇప్పుడు 32 ఏళ్ళు వచ్చేసరికి తగ్గిపోతుందట. దీనికి పౌష్టికాహార లోపం కారణం కావచ్చుంటున్నారు నిపుణులు. వివిధ కారణాల వల్ల పిల్లల్ని కనడాన్ని వాయిదా వేయడం, పుడతారేమో చూద్దామని చాలాకాలం వేచి చూడటం, బిగుతు దుస్తులు ధరించడం, ఉష్ణ వాతావరణంలో పని చేయడం ఎక్కువ సమయం డ్రైవింగ్ చేయడం, విపరీతంగా లాప్‌టాప్ వాడకం, పురుషుల్లో సంతాన రాహిత్యానికి మరో ప్రధాన కారణం 'వెరికోసిల్' వృషణాల దగ్గర రక్తనాళాలు మందంగా మారడంతో ఆ భాగంలో ఉష్ణోగ్రత పెరిగి వీర్యకణాలు ఉత్పత్తి తగ్గిపోతుంది. హార్మోన్ల సమస్య పురుషుల్లోను ఉంటుంది. దానికి కారణం బట్ట తల, రొమ్ము కణజాలం ఉబ్బినట్లుగా ఉండటం, స్పెర్మ్ కౌంట్ తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. డయాబెటిస్ కేసులాగా ఈ మధ్య ఇది పెరుగుతోంది. ఈ రెండింటికి ఒకదానికొకటి సంబంధం ఉందని అంటున్నారు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ సంస్థ నిపుణులు.

ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఒబెసిటీ సమస్య చాలా వేగంగా పెరుగుతోంది. స్థూలకాయం వల్ల బిపి, డయాబెటిక్ లాంటి జబ్బులే కాదు హార్మోన్ల సమస్యలు వస్తాయి. పోషకాహార లోపం శుక్రకణాలు అండాల నాణ్యతను తగ్గిస్తుంది. చక్కెర అతిగా వాడకం ప్రాసెస్డ్ ఫుడ్ కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం పునరుత్పత్తి సామర్థ్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. కొత్తగా వచ్చిన సమస్య నిద్రలేమి. ఎంత లేదన్నా దాదాపు రెండు గంటలు నిద్ర తగ్గిపోతుంది. 8 గంటలు నిద్ర ఉంటేనే శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా పనిచేస్తాయి.

ఈ తరం ఆ విషయాన్ని అసలు గుర్తుంచుకోవడంలేదు. రాత్రీ పగలు తేడా లేకుండా జీవితాన్ని ఆస్వాదిస్తూ జీవన విధానాన్ని తనకిష్టం వచ్చినట్టు నడుచుకుంటున్నారు. దాని ఫలితంగా హార్మోన్ల వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. సంతానలేమితో బాధపడుతున్న స్త్రీ పురుషులు ఇద్దరు కూడా సరైన అవగాహన లేకుండా బాధపడుతుంటారు. సంతానలేమి సమస్య అనగానే మొదట స్త్రీల వైపు వేలెత్తి చూపించేది ఒకప్పటి సమాజం. కాని ఇప్పుడు కొత్త టెక్నాలజీ, డిజిటల్, సైన్సు కొత్త కొత్త విషయాలు తెలుసుకొని సమాజంలో ఇప్పుడిప్పుడే స్త్రీ పురుషుల ఆరోగ్య సమస్యలు చూడటం జరుగుతుంది. భార్యాభర్తలు ఎలాంటి సమస్యలు అయినా లోపం ఎవరిలో ఉన్నా మంచి డాక్టర్లను సంప్రదించి, ఇరువురు దానికి సంబంధించి మందులు వాడితే సంతానం కలుగుతున్నారు. భార్యాభర్తలు సంసారం సుఖంగా ఆనందంగా జీవితం గడుపుతున్నారు. భార్యాభర్తల బంధం ఎలాంటిది అంటే కోపం ఎక్కడ ఉంటుందో ప్రేమ కూడా అంతే మోతాదులో ఉంటుంది. ఒకరి తప్పుల్ని మరొకరు క్షమించేసుకుని జీవితాన్ని హాయిగా, ఆనందంగా గడపాలి.

పెళ్ళి తరువాత భార్యాభర్తలు తమ పిల్లలను అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు. సంతోషంగా మీరు ఎలాగైతే ఉంటున్నారో భర్తవైపు తల్లిదండ్రులు కాని, భార్యవైపు తల్లి దండ్రులు కానీ వారిని కూడా చూసుకొనే బాధ్యత ఉన్నది అనే విషయమే మరిచిపోతున్నారు. పెళ్ళి చేసిన తరువాత తల్లిదండ్రుల కోరిక మా వయసు అయిపోయినది. మేము ఎక్కువ రోజులు బ్రతుకము కదా, ఒకే ఒక కోరిక బ్రతికి వున్న నాలుగు రోజులు కన్నబిడ్డల దగ్గర మనశ్శాంతిగా బ్రతికి ప్రశాంతంగా తనువు చాలించాలని వుంటుంది. పిల్లలు వారితో ఉండటం వల్ల ఒంటరితనం, ఒత్తిడి, నిరాశను తగ్గించడంలో సహాయపడుతుంది. వారి ఆరోగ్యం మెరుగు పడుతుందని నిపుణులు తేల్చారు.

కాని ఈ తరం ఆడపిల్లలకు భర్తలు కావాలి, వాళ్ళు సంపాదించే లక్షల జీతం కావాలి. వాళ్ళ ఆస్తులు కావాలి. కాని వాళ్ళ తల్లిదండ్రులు మాత్రం వద్దు అంటారు. ఒక్కసారి ఆలోచించడానికి ప్రయత్నం చేయండి. ఇప్పుడు మీరు వృద్ధాప్యంలో ఉన్నవారికి, మంచిగా వారి బాగోగులు చూసుకుంటే మీరు వారికి ఎలాంటి సేవ చేశారో రేపు మీ పిల్లలు కూడా మా తల్లిదండ్రుల సేవ చేయాలి అని వారి మనసులో వస్తుంది.

దైవగ్రంథంలో ఇలా వుంది: **"బలహీనావస్థ నుండి మీ పుట్టుకను ప్రారంభించినవాడూ, మళ్ళీ ఆ బలహీనత తరువాత మీకు బలాన్ని ప్రసాదించినవాడూ, ఆ బలం తరువాత మళ్ళీ మిమ్మల్ని బలహీనులుగా, ముసలివారుగా చేసినవాడూ అల్లాహ్‌యే కదా! ఆయన తనకు ఇష్టమైన దానిని సృష్టిస్తాడు".** *(ఖుర్ఆన్ 30: 54)*

మరోచోట ఈ విధంగా వుంది: వారు ఇలా ప్రార్థిస్తూ ఉంటారు- **"మా ప్రభూ! మాకు మా భార్యల ద్వారానూ మా సంతానం ద్వారానూ కన్నుల చల్లదనాన్ని ప్రసాదించు, మమ్మల్ని భయభక్తులు కలవారికి ఇమాములుగా చేయి".** *(ఖుర్ఆన్ 25: 74)* ✤

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# క్షమా గుణం

**ముహమ్మద్ వహీదుద్దీన్**

ఒకరోజు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) ఒక చెట్టుకు ఆనుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను హతమార్చడానికి ఇదే మంచి సమయమని ఒక శత్రువు కత్తితో ఆయన ముందుకు వచ్చి "ఇప్పుడెవరు నిన్ను రక్షిస్తారు?" అని కత్తి దూశాడు. అల్లాహ్ రక్షిస్తాడని దైవప్రవక్త(స) చెప్పారు.

అంతే, శత్రువు చేతిలోని కత్తి జారిపోయింది. ప్రవక్త(స) ఆ కత్తి తన చేతిలో తీసుకుని, ఇప్పుడు నిన్నెవరు రక్షిస్తారని అడిగారు. ఆ వ్యక్తి వణుకుతూ 'ఎవరూ లేరు' అన్నాడు. ఆ వ్యక్తిని క్షమించి వదిలేశారు.

దైవప్రవక్త పినతండ్రి హజ్రత్ హమ్జా (రజి)ను అత్యంత కిరాతకంగా హతమార్చిన వహ్షీని ఆయన క్షమించారు. తన కుమార్తె జైనబ్ గర్భంతో ఉన్నప్పుడు ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి, ఆమెకు గర్భస్రావమయ్యేలా చేసిన శత్రువులను క్షమించారు. మక్కా నగరంలో తనపై దౌర్జన్యాలకు, దుర్మార్గాలకు పాల్పడిన శత్రువులందరినీ మక్కా విజయం తర్వాత క్షమించారు.

ఒకసారి దైవప్రవక్త(స) తన అనుచరులతో మస్జిదులో ఉన్నప్పుడు ఒక పల్లెవాసి అక్కడికి వచ్చాడు. అక్కడే మూత్ర విసర్జన చేస్తున్నాడు. అనుచరులు కోపంగా అతనివైపు వెళ్ళబోతే, దైవప్రవక్త(స) వారిని అడ్డుకున్నారు. బకెటు నీళ్ళు తెచ్చి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయమని చెప్పారు. ఆ పల్లెవాసితో, మస్జిదు ఆరాధనా ప్రదేశమని, ఇక్కడ మూత్ర విసర్జన వంటి పనులు చేయరాదని చెప్పి పంపేశారు. తాను చేసిన తప్పును తెలుసుకొని సిగ్గుతో తలవంచుకుని ముందుకు సాగిపోయాడు.

దైవప్రవక్త ముహమ్మద్(స)పై ఒక మహిళ ప్రతి రోజు చెత్త కుమ్మరించేది. ఆయన ఇంటి నుంచి మస్జిదుకు నడిచి వెళ్ళే దారిలో ఆమె ఇల్లు ఉంది. ఇంటిపైకప్పు నుంచి ఆమె చెత్త ఆయనపై వేసేది. ఆయన మౌనంగా వెళ్ళిపోయేవారు. ఏమీ అనేవారు కాదు.

ఒకరోజు ఆయన వెళుతున్నప్పుడు ఈ మహిళ కనిపించలేదు. ఆయన అక్కడ ఆగి ఆ మహిళ గురించి అక్కడి వారిని అడిగారు. ఆమె అనారోగ్యంతో మంచంపై ఉందని తెలిసింది. దైవప్రవక్త(స) ఆమె ఇంటికి వెళ్ళి ఆమెను పరామర్శించారు. ఆమెకు ధైర్యం చెప్పారు. ప్రవక్త వైఖరి ఆమెపై గొప్ప ప్రభావం వేసింది.




# ఉర్దూలో పాఠశాల పేరు.. ప్రిన్సిపాల్ సస్పెండ్...

- అర్షియా

**యూపీ.. బిజ్నోర్ జిల్లా సహారా బ్లాక్‌లో** ఒక ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్ ఖాన్‌ను సస్పెండ్ చేయడం పెద్ద దుమారాన్ని రేపింది. ఆయన పాఠశాల గోడలపై పాఠశాల పేరును ఉర్దూలో వ్రాయించడమే దీనికి కారణం. ఈ ఘటన ఉర్దూ భాష స్థితిపై తీవ్ర చర్చకు దారి తీసింది.

పాఠశాల గోడలపై ఒకవైపు హిందీలో, మరోవైపు ఉర్దూలో పాఠశాల పేరు వ్రాయబడి ఉంది. ఆ గోడ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కొన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు ఉర్దూ వాడకాన్ని వ్యతిరేకిస్తూ వ్యతిరేకత వ్యక్తం చేశాయి. బేసిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంటనే దర్యాప్తుకు ఆదేశించారు. దర్యాప్తులో ఉర్దూ వ్రాతకు ముందస్తు అనుమతి తీసుకోలేదని తేలింది. దీంతో ప్రిన్సిపాల్ రఫత్ ఖాన్‌ను నియమ నిబంధనలు ఉల్లంఘించారని, చట్ట పరమైన క్రమశిక్షణ పాటించలేదని ఆరోపిస్తూ సస్పెండ్ చేశారు. పాఠశాల స్థలంలో ఏవైనా రాతలు, పనులు చేయాలంటే అధికార అనుమతి అవసరమని అధికారులు చెప్పారు. చాలామంది ప్రిన్సిపల్ ఖాన్‌కు మద్దతుగా నిలిచి, పాఠశాలలో ఉర్దూ వాడకాన్ని సమర్థించారు. ఉర్దూ భాష ఉత్తరప్రదేశ్‌లో అధికారికంగా గుర్తించబడిన భాషల్లో ఒకటి, దీనికి గొప్ప సాంస్కృతిక, చారిత్రక ప్రాముఖ్యత ఉందని వారు వాదించారు.

స్థానిక ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త ఇమ్రాన్ సిద్దికీ మాట్లాడుతూ:

"ఉర్దూ మన వారసత్వం. భారత ముస్లింల రాజ్యాంగ హక్కులను గౌరవించాలి. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయడం అన్యాయం."

పలువురు తల్లిదండ్రులు, సంఘ సభ్యులు ప్రిన్సిపాల్‌ను వెంటనే పునర్నియమించాలని నిరసన తెలిపారు. విద్యార్థి తల్లి ఫాతిమా బేగం వ్యాఖ్యానిస్తూ:

"ఉర్దూ కేవలం ఒక భాష మాత్రమే కాదు- అది మన ఐడెంటిటీ. ప్రిన్సిపాల్ ఖాన్‌ను శిక్షించడం ద్వారా ముస్లిం సముదాయాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు."

సోషల్ మీడియాలో "ఉర్దూకు మద్దతు- ఖాన్‌కు మద్దతు" హ్యాష్ ట్యాగ్‌లు రోజుల పాటు ట్రెండ్ అయ్యాయి.

ఈ సస్పెన్షన్ వెనుక రాజకీయ ఒత్తిళ్లు, మతపరమైన వివక్ష ఉన్నాయని విమర్శకులు ఆరోపిస్తున్నారు.

"ఇది ముస్లింల సాంస్కృతిక హక్కులను హరించడానికి జరిగే ప్రయత్నం. ఇది స్పష్టమైన వివక్ష, దీనిని వ్యతిరేకించాల్సిందే" నని పత్రికా విలేఖరి నసీమ్ అలీ వ్యాఖ్యానించారు.

అయితే, ఉర్దూ వ్రాతకు వ్యతిరేకంగా ఉన్న కొందరు వ్యక్తులు, సంఘాలు దీన్ని "ఉర్దూకరణ" ప్రయత్నంగా అభివర్ణిస్తూ విద్యా వ్యవస్థలో మత ప్రభావాన్ని తప్పుపట్టారు. వారి భావన ప్రకారం ఉర్దూ వాడకంతో స్థానిక సంస్కృతి ప్రమాదంలో పడుతుందని వారు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు, అయితే ఉర్దూ భాష ఆ ప్రాంతంలో చారిత్రకంగా ఉన్నదన్న విషయాన్ని వారు విస్మరిస్తున్నారు. ఇన్ని విమర్శల తరువాత కూడా విద్యా శాఖ ఇంకా సస్పెన్షన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేదు. "ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషలు ఉత్తరప్రదేశ్‌లో అధికారికంగా గుర్తించబడ్డవి. వాటి వాడకాన్ని విద్యా సంస్థలలో నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమ"ని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

అడ్వొకేట్ అన్వర్ ఖాన్ మాట్లాడుతూ: "మైనారిటీ హక్కులను కాపాడాలి. ఇటువంటి చర్యలు భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను బలహీనపరుస్తాయి" అన్నారు.

బిజ్నోర్ ఘటన భారత ముస్లింలు తమ హక్కులు, సాంస్కృతిక వారసత్వాన్ని నిలబెట్టుకోవడంలో ఎదురవుతున్న సవాళ్లను ప్రతిబింబిస్తోంది.

"మేము కోరేది గౌరవప్రదమైన జీవితం. మా భాషలూ, సంస్కృతి గౌరవించబడాలి. పాఠశాల పేరు ఉర్దూలో వ్రాయడం నేరం కాదు - అది మా హక్కు." అని ఇమ్రాన్ సిద్దీఖీ అన్నారు. ✤

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది    ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు    మక్కా అవతరణ

# 46. అల్ అహ్కాఫ్

6 మరి మానవులందరూ సమావేశ పరచబడినప్పుడు వారు తమను పిలిచేవారికి శత్రువులుగా, వారి ఆరాధనను నిరాకరించేవారుగా తేలుతారు.[7]

7 – 8 వీరికి మా స్పష్టమయిన వచనాలు వినిపించినప్పుడు, సత్యం వారి సమక్షంలోకి వచ్చేసినా ఈ తిరస్కారులు దాన్ని గురించి, ఇదంతా పచ్చి మంత్రజాలం అని అంటారు.[8] వారనేదేమిటీ, దీన్ని ప్రవక్త స్వయంగానే కల్పించు కున్నాడనేనా?[9] వీరికి చెప్పు, "నేను స్వయంగా దీన్ని కల్పించినట్లయితే మీరు నన్ను దేవుని పట్టు నుండి ఎంతమాత్రం తప్పించజాలరు, మీరు చేస్తున్న ప్రేలాపనలేవో అల్లాహ్ బాగా ఎరుగు; నాకూ మీకూ మధ్యన సాక్ష్యం పలకడానికి ఆయన మటుకే చాలు,[10] మరాయన ఎంతో క్షమించేవాడు, మరెంతో కరుణించేవాడు."

7. అంటే, వారు స్పష్టంగా చెప్పివేస్తారు, మా ఆరాధన చేయాలని మేమెన్నడూ వారికి చెప్పలేదని, అలాగే వారు తమ ఆరాధన చేసే వారన్న విషయం తమకు అసలే తెలియదని, ఇంకా వారి ఈ అపమార్గానికి వారే బాధ్యులని, దాని శాస్తి కూడా వారే భరిం చాలని, ఈ పాపంలో తమ వాటా ఏదీ లేదని కూడా వారు బాహాటంగా స్పష్టంగా ప్రకటిస్తారు.

8. దీని భావమేమిటంటే, ఖుర్ఆన్ ఆయత్‌లు మక్కా తిరస్కారుల ముందు చదవబడినప్పుడు ఈ వచనం వైభవం రీత్యా మానవ వచనం కన్నా ఎన్నో రెట్లు ఉత్తమమయిందని గ్రహించేవారు. తమలోని ఏ కవి, ఏ గొప్ప వక్త, ఏ మహా సాహితీకారుని వచనానికీ ఖుర్ఆన్ అందజేసే అనుపమ భావ స్పష్టత, భావగర్భత, మైమరపింపజేసే దాని వక్తృత్వం, ఉన్నతమయిన దాని విషయ వైభవం, మనస్సుల్లోకి చొచ్చుకుపోయే దాని శైలికి ఎక్కడా పోలిక లేదు. అన్నింటికన్నా గొప్ప విషయమేమిటంటే స్వయంగా ప్రవక్త మహనీయులు పలికే మాటల్లోనూ దైవం తరఫున ఆయనకు అవత రిస్తున్న వచనంలోని గాంభీర్యం ప్రాభవం కానవచ్చేవి కావు. ఎవరయితే చిన్నప్పటి నుంచి ఆయన్ని చూస్తూ వస్తున్నారో వారికి బాగా తెలుసు, ఆయన మాటలాడే భాషలోనూ ఖుర్ఆన్ భాషలోనూ గల వ్యత్యాసం ఎంత మహత్తరమయిందో. ఒక మనిషి నలభయి యాభయి ఏళ్ళు రేయింబవళ్ళు తమ మధ్య గడిపినవాడు, అకస్మా త్తుగా తనకు బాగా పరిచయమున్న భాషతో, దానికి ఏమాత్రం పోలిక లేని భాషలో ఒక వచనాన్ని రచియించుకున్నాడన్న విషయం వారు ఏ విధంగానూ నమ్మలేని విషయం. ఈ విషయం వారి ముందుకు సత్యాన్ని పూర్తిగా బహిర్గతపరచి తీసుకువస్తుంది. కాని వారు తమ తిరస్కారంపైన మొండిగా పట్టుపట్టి ఉండాలని నిర్ణ యించుకోవడం చేత ఈ అతి స్పష్టమయిన సంకేతాన్ని చూసి సక్రమంగా ఈ వచనాన్ని దైవవాణి వచనమని నమ్మడానికి బదులు ఇదేదో మంత్రతంత్ర మహిమ అని మాటలు కల్పించేవారు. (వీరు ఖుర్ఆన్‌ని మరో కోణంలోనూ మంత్రజాలమని చెప్పేవారు. మేము ఇంతకు ముందు దీన్ని వివరించి ఉన్నాము. చూడండి ఖుర్ఆన్ అవగాహనం,సం.4, అల్ అన్బియా:పాదసూచి 5; సం.7, సాద్ : పాదసూచి 5).

9. ఈ ప్రశ్నార్థక భావ ప్రకటనా రీతిలో అత్యంత ఆశ్చర్యం గోచరిస్తుంది. భావమేమిటంటే, వీరు ఈ మేరకు సిగ్గులేనివారయి పోయారా, స్వయంగా ఖుర్ఆన్ కల్పించి తీసుకువస్తున్నట్లు మహనీయ ముహమ్మద్ పైనే నింద మోపుతున్నారా? నిజానికి వీరికీ బాగా తెలుసు, ఇది ఆయన రచించిన వచనం కాజాలదని. వీరు దీన్ని మంత్రజాలమనడమే, ఇదొక అసాధారణమయిన వచనమనడానికి అతి స్పష్టమయిన తార్కాణం. అంటే ఇదొక మానవీయ రచన కావడం వీరి దృష్టిలోనూ సాధ్యమయిన విషయం కాదు.

10. వీరి నింద కేవలం నిరాధారమయినదవటం, అది ఆసాంతం మంకుపట్టు మూలంగా మోపినదే కావడం పూర్తిగా వెల్లడవుతూనే ఉండటం చేత దాన్ని ఖండిస్తూ నిదర్శనాలు చూపెట్టే ఆవశ్యకత లేకపోయింది, కేవలం ఇంతే చెప్పడంతో సరిపుచ్చడం జరిగింది – మీరు నింద మోపుతున్నట్లు, నేను వాస్తవంగానే స్వయంగా ఈ వచనాన్ని రచించి అల్లాహ్‌కు దీన్ని ఆపాదించే దారుణమయిన అపరాధం చేస్తున్నట్లయితే, నన్ను దైవం పట్టు నుండి విడిపించడానికి మీరు రాబాకండి. కాని ఇది దైవ వచనమే అయి, మీరు అబద్ధపు నేరారోపణ చేస్తూ దీన్ని కాదంటున్నట్లయితే అల్లాహ్ స్వయంగానే మిమ్మల్ని చూసు కుంటాడు. యదార్థం అల్లాహ్ కనుమరుగయి లేదు. సత్యాసత్యాల తీర్పు చేయడానికి ఆయనే చాలు. ప్రపంచమంతా కలసి ఒకరిని అబద్ధాలాడుతున్నట్లు ఆరోపించగా అల్లాహ్ జ్ఞానం ప్రకారం అతను నిజం పలుకుతున్నవాడయినట్లయితే అంతిమ నిర్ణయం ఎట్టి పరిస్థితిలోనూ అతనికి అనుకూలంగానే జరుగుతుంది. లోకమంతా కలసి ఒకరిని నిజం పలుకుతున్నట్లు చెప్పగా అల్లాహ్ జ్ఞానం ప్రకారం అతను అబద్ధం పలికేవాడయినట్లయితే కడకు అతను అబద్ధం పలికేవానిగానే పరిగణించబడతాడు. కనుక తప్పుడు వంకలు వెదకడానికి బదులు మీ పరిణామాన్ని గురించి చింతించండి.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**



كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2

**(కితాబుల్ మగాజీ)**

## కిస్రా (ఈరాన్ చక్రవర్తి)కి, ఖైసర్ (రోము చక్రవర్తి)కి సందేశ లేఖలు

**283)** అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈరాన్ చక్రవర్తి కిస్రా పేరున ఒక ఉత్తరం వ్రాయించి, అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా సహ్మీ(రజి)కి ఇస్తూ, "ఈ ఉత్త రాన్ని (కిస్రా సామంతుడైన) బహ్రైన్ గవర్నర్‌కు అందజేయి" అని ఆజ్ఞాపించారు. కిస్రా ఆ ఉత్త రాన్ని చదివి (గర్వాహంకారంతో) చించి ముక్కలు ముక్కలు చేసేశాడు. తరువాత దైవప్రవక్త(స) అతన్ని అధిక్షేపిస్తూ అతన్ని కూడా తునాతునకలుగా చేసెయ్యమని దైవాన్ని వేడుకున్నారు.[1]

**284)** అబూ బక్రా (రజి) గారు హసన్ బస్రీతో ఇలా అన్నారు: జమల్ యుద్ధ సందర్భంగా నాకు ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పి ఉన్న ఒక పలుకు జ్ఞాపకం వచ్చింది. దాంతో నేను, ఆయిషా (ర.అ) మరియు ఆమె సైనికులతో కలసి (అలీ–రజి) సైన్యంతో యుద్ధం చేసే సంకల్పాన్ని ఉప సంహ రించుకున్నాను. ఆయన ఇలా అన్నారు : పారసీక దేశస్థులు కిస్రా మనవరాలిని సింహాసనంపై కూర్చోబెట్టి ఆమెకు రాజ కిరీటం తొడిగించారని దైవప్రవక్త(స)కు తెలిసినప్పుడు, "తమ రాజ్యాధికారాన్ని ఒక స్త్రీకి కట్టబెట్టిన జాతి ఎన్నటికీ బాగుపడదు" అని పలికారు.

283-1. వాఖిదీ ప్రకారం ఆ ఉత్తరంలో ఇలా లిఖించబడింది:

"బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్. దైవప్రవక్త ముహమ్మద్ తరపున పారసీక చక్రవర్తి కిస్రాకు....


"ఎవరయితే సన్మార్గాన నడుస్తూ అల్లాహ్‌ను విశ్వసిస్తాడో, అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేడని, ఆయన ఏకేశ్వరుడని, ఆయనకు సాటి ఎవరూ లేరని సాక్ష్యమిస్తాడో, ముహమ్మద్ దైవదాసుడని, దేవుని తరఫున పంపబడిన సందేశ హరుడని విశ్వసిస్తాడో అతను సురక్షితంగా ఉంటాడు. నేను నిన్ను దైవాజ్ఞ మేరకు ఇస్లామ్ వైపు నకు పిలుస్తున్నాను. ఎందు కంటే, నేను అల్లాహ్ తరపున మానవాళి వైపునకు పంప బడ్డాను... కనుక నీవు ముస్లిమ్‌వి అయిపో. అన్యధా పారసీకు లందరి పాపభారం నీ మీద పడుతుంది."

అతను ఆ ఉత్తరానికి ఎలాంటి విలువ ఇవ్వలేదు సరికదా దానిని చించి పారేశాడు. అంతేకాదు, అతను తన గవర్నర్ బాజాన్‌కు ఉత్తరం రాస్తూ, 'నీవు మదీనా వెళ్ళి ఆ ప్రవక్తతో మాట్లాడు. అతను దైవప్రవక్తనన్న దావాను ఉపసంహరించు కుంటే సరి. లేదంటే అతని తలను నరికి నా సమక్షంలో సమర్పించు' అని ఆజ్ఞాపించాడు.

బాజాన్ మదీనా వచ్చి, కిస్రా ఉత్తరువును దైవప్రవక్త(స)కు వినిపించాడు. అది విని దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : "నీకు ఒక విషయం తెలియాలి. ఈ రోజు రాత్రి నా ప్రభువు, కిస్రా కుమారుడు షేర్‌వియా ద్వారా అతన్ని అంతమొందిం చాడు. ఇప్పుడు మీ ప్రభుత్వం ముక్కచెక్కలు కానున్నది"- ఈ సంఘటన హిజ్రీ 7వ సంవత్సరం జమాదివుల్ ఊలా నెలలో సంభవించింది. ఆ తరువాత షేర్‌వియా 6 నెలల వరకూ పారసీక రాజుగా ఉన్నాడు. ఒకరోజు రాజ్య కోశాగారంలో అతనికి ఒక సీసా కనిపించింది. దానిపై 'లైంగిక సామర్థ్యాన్ని పెంచే మందు' అని వ్రాసి ఉంది. అతను దానిని త్రాగగానే మృత్యువాతన పడ్డాడు. నిజానికి అది విషం. ఆ తర్వాత కిస్రా మనవరాలు- అంటే షేర్‌వియా కూతురు-పూరాన్ పరిపాలకు రాలు అయింది. ఆ తరువాత పారసీక సామ్రాజ్యం పతన దిశలో పయనించింది.

# సాఫల్యానికి నాలుగు మెట్లు

- సఫూర




**మనిషి సాఫల్యానికి నాలుగు విషయాలు ఎంతో అవసరం. ఒకటి: కృతజ్ఞత. రెండు: విశ్వాసం. మూడు : ఇస్తిగ్ఫార్. నాలుగు : దుఆ. ఈ నాలుగు విషయాలను అవలంబించడం వల్ల మనిషి వ్యక్తిత్వం వికసిస్తుంది. ఇహపరాలలో సాఫల్యం లభిస్తుంది.**

## కృతజ్ఞత

దాసుడు దైవానికి కృతజ్ఞుడై ఉండాలన్నది ఇస్లామ్ మౌలిక బోధన. మనిషి మంచి జీవితం గడపడానికి దైవం అనేక వరాలను ప్రసాదించాడు. ఎన్నో అనుగ్రహాలు ఇచ్చాడు. అందమైన శరీరం ఇచ్చాడు. కళ్ళు, ముక్కు, చెవులు, అర్థం చేసుకునే శక్తి సామర్థ్యాల నిచ్చాడు. అన్నిటికీ మించి రుజుమార్గాన్ని చూపాడు. ఖుర్ఆన్ ఇలా అంటోంది:

''మీరు అడిగిన సమస్తాన్నీ మీకు ఇచ్చిన వాడు అల్లాహ్యే. మీరు గనక అల్లాహ్ అనుగ్రహాలను లెక్కించదలిస్తే, లెక్కించ లేరు'' (ఇబ్రాహీమ్ : 34).

ఈ విషయాలను గ్రహించిన వారి హృదయం అల్లాహ్ కృతజ్ఞతా భావంతో నిండిపోతుంది. ఖుర్ఆన్ ఇలా పేర్కొంది: **"అల్లాహ్ మిమ్మల్ని మీ మాతృ గర్భాల నుంచి మీరు ఏమీ ఎరుగని స్థితిలో ఉండగా బయటికి తీశాడు. ఆయన మీకు చెవులు ఇచ్చాడు. కళ్ళు ఇచ్చాడు. ఆలోచించే మనస్సూ ఇచ్చాడు- మీరు కృతజ్ఞులు కావాలని".** (అన్ నహ్ల్ : 78)

ఖుర్ఆన్ మాటి మాటికి దీనివైపు దృష్టి మళ్లిస్తుంది. నహ్ల్ సూరాలో ఆయత్ 10 నుంచి 14 వరకు అల్లాహ్ తన అనుగ్రహాలను ప్రస్తావించిన తరువాత **'లఅల్లకుమ్ తష్కురూన్'** అని సెలవిచ్చాడు. దాసుడు దైవానుగ్రహాలను పొంది దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటే అల్లాహ్ అతనికి మరిన్ని అనుగ్రహాలను ప్రసాదిస్తాడు. కృతఘ్నతకు పాల్పడితే వాటిని లాక్కుంటాడు. శిక్షకూ గురిచేస్తాడు. ఇదే విషయాన్ని ఖుర్ఆన్ ఇలా పేర్కొంది:

మీ ప్రభువు ఇలా హెచ్చరిక చేశాడు: "మీరు గనక కృతజ్ఞులైతే, నేను మిమ్మల్ని ఇంకా ఎక్కువగా అనుగ్రహిస్తాను. ఒకవేళ కృతఘ్ను తకు పాల్పడితే నా శిక్ష చాలా కఠినంగా ఉంటుంది". (ఇబ్రాహీమ్ : 7) మరోచోట ఇలా ఉంది: "మీరు కృతజ్ఞతలు చూపే దాసులుగా ఉన్నప్పుడు, విశ్వాస మార్గంలో నడుస్తూ ఉన్నప్పుడు మిమ్మల్ని అల్లాహ్ నిష్కారణంగా ఎందుకు శిక్షిస్తాడు?" (అన్నిసా : 147). "మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకోండి. నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకుంటాను. నాకు కృతజ్ఞతలు తెలుపండి. చేసిన మేలును మరువకండి". (అల్ బకరా :152)

## విశ్వాసం

ఇస్లామ్ ధర్మానికి మూలం విశ్వాసం. ఇహపరాల సాఫల్యానికి ఇదే ఏకైక మార్గం. దీనిపట్ల నిర్లక్ష్యం వినాశాన్ని మిగిలిస్తుంది. విశ్వాసం తరుగుతూ పెరుగుతుంటుంది. దాని పట్ల ఎల్లప్పుడూ శ్రద్ధ వహించాలి. విశ్వాసం కేవలం నోటితో ప్రకటిస్తే సరిపోదు, దాన్ని మనో మస్తిష్కాల్లో నిక్షిప్తం చేసుకోవాలి. దాన్ని ఆచరణలో పెట్టాలి. ఖుర్ఆన్‌లో ఇలా సెలవీయడం జరిగింది: అల్లాహ్‌యే మా ప్రభువు అని పలికి ఆ మాట మీదనే స్థిరంగా నిలబడే వారిపై నిశ్చయంగా దైవదూతలు అవతరిస్తారు. వారు వారితో ఇలా అంటారు, "భయపడకండి, బాధపడకండి; మీకు వాగ్దానం చేయబడిన స్వర్గం అనే శుభవార్తను విని ఆనందించండి". (హామీమ్ అస్ సజ్దాహ్ : 30-31)

విశ్వాసం మనిషిని అంధకారం నుంచి వెలుగులోనికి, అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు తీసుకువెళుతుంది. ఖుర్ఆన్‌లో ఇలా సెలవీయబడింది: "అల్లాహ్ విశ్వాసులకు సంరక్షకుడు, సహాయకుడూను. ఆయన వారిని కటిక చీకట్ల నుంచి వెలికి తీసి వెలుగు చూపిస్తాడు. తాగూత్ అవిశ్వాస మార్గం అవలంబించే వారికి సంరక్షకులు, సహాయకులూను. వీరు వారిని వెలుగు నుంచి చీకటి వైపునకు లాక్కుపోతారు" (అల్ బకర : 257).

ప్రపంచంలోనే కాదు పరలోకంలోనూ విశ్వాసం జ్యోతిగా మారి మనిషికి మార్గం చూపుతుంది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: విశ్వాసులైన స్త్రీ పురుషుల ముందూ, వారి కుడి వైపునా వారి వెలుగు పరిగెడుతూ ఉండటాన్ని నీవు చూస్తావు. ఆ రోజున (వారితో) "ఈనాడు మీకు శుభవార్త ఉన్నది" అని అనబడుతుంది (హదీద్ : 12).

## ఇస్తిగ్ఫార్

మనిషి వల్ల తప్పులు, పొరపాట్లు జరగడం సహజం. కాని తన తప్పును తెలుసుకుని అల్లాహ్ దర్బారులో హాజరయి క్షమాభిక్ష కోరి పశ్చాత్తాపం చెందేవాడే ఉత్తముడు. పాపం చేయడం వల్ల హృదయంలో ఏర్పడే నల్లని మచ్చ పశ్చాత్తాపం వల్ల చెరిగిపోతుంది. నిరంతర పశ్చాత్తాపం మనిషిని దైవానికి అత్యంత సామీప్యం చేస్తుంది. దాసుడు పశ్చాత్తాపం చెందకపోతే అతని హృదయంపై పాపపు మచ్చ పెరిగిపోతుంది. చివరికి అతని కోసం రుజు మార్గ ద్వారాలు మూసుకుపోతాయి. పశ్చాత్తాపం అంటే అల్లాహ్ వైపు మరలడం. అంటే దాసుడు తన తప్పును తెలుసుకుని పశ్చాత్తాప భావంతో అల్లాహ్ వైపు మళ్ళాలి. తన తప్పును మన్నించమని అల్లాహ్ ముందు సాష్టాంగ పడాలి. దివ్య ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: "విశ్వాసులారా! చిత్తశుద్ధితో కూడిన పశ్చాత్తాపంతో అల్లాహ్ వైపునకు మరలండి, అప్పుడు అల్లాహ్ మీ చెడులను మీ నుండి దూరం చేసి, మిమ్మల్ని సెలయేళ్ళు ప్రవహించే స్వర్గ వనాలలో ప్రవేశింపజేస్తాడు". *(అత్ తహ్రీమ్ : 8)* ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మీ ప్రభువు సమక్షంలో పశ్చాత్తాపం చెందండి. నేను నా ప్రభువు ముందు వంద సార్లు పశ్చాత్తాపం చెందుతాను".

ఎవరయినా వ్యక్తి తన ఉపాధిలో వృద్ధి, ఆపదల నుంచి విముక్తి కోరుకుంటున్నట్లయితే అతను ఎక్కువగా ఇస్తిగ్ఫార్ చేస్తూ ఉండాలి. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: 'ఏ వ్యక్తి అయితే తనపై ఇస్తిగ్ఫార్ తప్పనిసరి చేసుకుంటాడో అల్లాహ్, అతని కొరకు ప్రతి కష్టం నుంచి బయట పడే మార్గాన్ని సుగమం చేస్తాడు. ప్రతి ఆపద నుంచి అతనికి విముక్తిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ అతనికి అతను ఊహించనైనా లేని మార్గాల నుంచి ఉపాధిని ప్రసాదిస్తాడు" (ఇబ్నె మాజ).

## దుఆ

సాఫల్యానికి చివరి ముఖ్యమైన విషయం దుఆ. మనిషి తన అవసరాల కోసం అల్లాహ్‌ను అర్థించాలి. అల్లాహ్ తన దాసుని అభ్యర్థనను ఎప్పుడూ వింటాడు. దాసుడు తన దైవాన్ని అర్థించకపోతే దేవుడు కూడా దాసుని గురించి పట్టించు కోడు. అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు: ప్రవక్తా! ప్రజలతో ఇలా అను, "మీరు నా ప్రభువును వేడుకోక పోతే, ఆయన మిమ్మల్ని ఎందుకు పట్టించుకోవాలి?" (ఫుర్ఖాన్ :77). దుఆ, దైవంతో దాసుని బంధాన్ని పటిష్ఠం చేస్తుంది. విశ్వాసికి ఆధారం దుఆ. విశ్వాసి ఆయుధం దుఆ. విశ్వాసి ప్రతి సమయం, ప్రతి విషయంలో తన వ్యవహారాన్ని అల్లాహ్ వైపు మళ్ళిస్తాడు. ప్రతి సమయంలో అల్లాహ్‌నే అర్థిస్తాడు. అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు: "మీ ప్రభువును వేడుకోండి, విలపిస్తూనూ గోప్యంగానూ. నిశ్చయంగా ఆయన మితిమీరి మెలిగే వారిని ప్రేమించడు".

*(ఆరాఫ్ : 55,56).*

మనం మన దైనందిన జీవితంలో ఈ నాలుగు విషయాలను పాటించి సాఫల్యం పొందడానికి ప్రయత్నిద్దాం. అల్లాహ్ మనం దరికీ వీటిని పాటించే సౌభాగ్యాన్ని ప్రసాదించుగాక! ✤

# నగరం

- కవి కరీముల్లా



నగరం
అప్పుడప్పుడూ
పిలుస్తూ వుంటుంది
సాహిత్య సభలనో
సామాజిక సభలనో
కొన్ని అలల్ని, ఆశయాల్ని
బ్యాగు అరల్లో భద్రంగా దాచి
కన్నార్పని కవిత్వ కనురెప్పనై
దిగులు మబ్బు తుంపరలో తడుస్తూ
బస్సులో ఒదిగి కూర్చుంటాను
కొన్ని రోజులే కావచ్చు
కొన్ని గంటలే కావచ్చు
ఊరిని విడిచి వెళ్తుంటే
తల్లి ఒడిని వీడి వెళ్తున్న బాధ
మసీదు వంటి స్కూలు
మమతల జడివానలయ్యే పిల్లలు
సాయం స్నేహ సమయాలు
టీకొట్టు ముచ్చట్లు
కొన్ని పువ్వులు, కొన్ని నవ్వులు
 బఠానీల్ని జేబుల్లో నింపుకుని
పరుగులు తీసే పసిపిల్లాడిలా
వడివడిగా ఇంటికొచ్చి
కొండకెదురు కూర్చుని
కుండ బద్దలు కొట్టినట్టు
కవిత్వం రాయడమంటే
నాకెంతో ఇష్టం
నగరంలో ఏముంది కనుక!
పలకరింతలు, పులకరింతలు
పార్కుల్లో ప్లాస్టిక్ పువ్వులే
నగరంలో నడవటమంటే
వినుకొండ కొండ బండలపై
చిందేసినంత సులభం కాదు
కీచురాళ్ళ ధ్వనుల్లా హారన్ మోతలు
అచ్చోసిన ఆంబోతుల్లా
సిటీ బస్సులు, కార్లు
కొండచిలువల్లాంటి రోడ్లు
నట్టడివిలో నడిరేయి
దారి తప్పినట్టుంటుంది..
కవిత్వం ఒక ఉద్యమం
కవిత్వం ఒక పోరాటం
కవిత్వం ఒక తపస్సు
గిజిగాడి గూడులా భావం
ఓర్పు చెట్టుకు వేలాడ్తుంది
నేర్పుతో నడుస్తూ వుంటాను
నాగరికత ఆనవాళ్ళను వెతుక్కుంటూ

✤

# తల్లి పాదాల క్రిందనే స్వర్గం

పోలంకి విజయభాస్కర్

**'అమ్మ'** అన్నది ఓ కమ్మని మాట. అది మమతల మూట. 'అమ్మ' అంటే అంతులేని సొమ్ము. 'అమ్మ' మనసు అమృతపు ఊట. 'అమ్మ' ప్రేమ విరబూసిన పూలతోట. 'అమ్మ' అనురాగం మధురాతి మధురం.

అమ్మ ఓ కావ్యం. అమ్మ ఓ కామధేనువు. అమ్మ ఓ కల్పవృక్షం.... ఇలా చెప్పుకుంటూపోతే ఈ విశ్వంలో అమ్మ అన్న మాటకన్నా తీయనైన మాట లేదు. అమ్మలా మమతను పంచిపెట్టే మనిషి మరొకరు ఉండరు కాక ఉండరు. అమ్మ అంటే వెలకట్టలేని సొమ్ము. అంతు తెలియని రత్నాల గని. వజ్రాల మూట, మేలిమి కోట. అతి స్వచ్ఛ మైనది అమ్మ మనసు. అమ్మ ప్రేమ సుగంధాల భరితం. సుపరిమళ సుశోభితం. ఆ ప్రేమ సుగంధాలను ఆస్వాదించిన బిడ్డల జీవితం అమరం. అమ్మ చూపే అనురాగపు మధురిమను పోలిన మధురమైన మధురం ఈ సృష్టిలో మరొకటి లేనే లేదు. అమ్మ ప్రేమను నోచుకున్న బ్రతుకు ధన్యం.

తొమ్మిది నెలలు మనల్ని మోసిన అమ్మ తాను పురిటినొప్పులు భరిస్తూ మనల్ని ఈ భూమ్మీదకు తీసుకొచ్చింది. తాను తిన్నా తినకున్నా మన కడుపు నింపటమే తల్లిగా తన కర్తవ్యమని భావించింది. మనల్ని గొప్పగా పెంచాలని ఆ తల్లి హృదయం ఎన్నో కలలు కంటుంది. అమ్మా అని ఆక్రోశిస్తే ఆ అమ్మ తన గుండెలో పిడిబాకు దిగినంతగా ఎంతో విలవిల్లాడుతుంది. ఏ చిన్న అనారోగ్యపు నీలినీడ మీ ఆరోగ్యాన్ని కమ్మి వేసినా తన సర్వస్వాన్ని త్యాగం చేసి మీరే ప్రాణంగా ఎలా మీకు సేవలందించి మిమ్మల్ని ఆదుకుని అక్కున చేర్చుకుని ఆ అనారోగ్యం నుండి ఎప్పుడు బయట పడతారా అని తల్లడిల్లిపోతుంది.

తల్లిదండ్రులకు కృతజ్ఞులుగా ఉండాలి. మేలు చేసిన వారికి కృతజ్ఞులుగా ఉండటం, ప్రత్యుపకారం చేయడం సజ్జనుల ప్రధాన లక్షణం. వాస్తవమే మిటంటే, మన ఉనికికి కారణభూతులు తల్లిదండ్రులు. వారు అనన్యమైన త్యాగం, అనుపమానమైన ఔదార్యం, అసాధారణమైన కృషితో మనల్ని పోషిస్తారు. తమ ప్రాణాలకు సమానంగా మనల్ని సంరక్షిస్తారు. అందుకు మన హృదయం విశ్వాసంతో, కృతజ్ఞతతో, గౌరవంతో, ప్రేమానురాగాలతో ఉప్పొంగి పోవాలి. మన గుండెల్లోని అణువణువు కృతజ్ఞతా భావంతో నిండిపోవాలి.

తనకే బాధ వచ్చినా అమ్మా అంటూ ఆర్తిగా ఆక్రోశించే బిడ్డలు అమ్మలకు శోకం కలిగించటం ఘోరమైన పాపం. ఆప్యాయతాను రాగాలు, మమతానురాగాలకు కొలువైన, నెలవైన మాతృమూర్తి ఏ ఇంట కన్నీరు పెట్టుకుంటుందో ఆ ఇంట సిరి నిలవదు. ఆ ఇంట దారిద్ర్యం తాండవిస్తుంది. "కన్న తల్లి కంట కన్నీరొలికిన తొలగి పోవురా సిరులు" అన్నది ఈ జగతి కాదనలేని నిజం. అమ్మతనంలోని కమ్మదనాన్ని ఆమె గుండె చప్పుడు ఆగిపోయేంత వరకూ ప్రతి బిడ్డా ఆస్వాదించాలి. అమ్మ అనురాగాన్ని, ఆమె ఆత్మ పరమాత్మను చేరుకునే చివరి క్షణం దాకా పొందగలిగిన తనయా తనయుల జన్మ నిజంగా చరితార్థం.

అమ్మ ఉండగా ఈ పృధ్వీ తలంపై ఏ బిడ్డా అనాథ కాడు. కానీ బిడ్డలున్న తల్లి అనాధ కావటం భరించలేని ఘోరం. క్షమించరాని నేరం. ఎల్లప్పుడు తల్లిదండ్రులను సంతోషపరచడానికి ప్రయత్నించాలి. వారి ఇష్టానికి, స్వభావానికి వ్యతిరేకంగా వారికి బాధ కలిగేలా మాట్లాడకూడదు. వారి ప్రతి మాటను సంతోషంతో సహించాలి. వారన్న మాటలకు చికాకు పడి వారి మనసును నొప్పించే విధంగా మాట్లాడరాదు. అసలు వృద్ధాప్యంలో మాటను భరించడం కష్టం. ప్రతి చిన్న మాట కూడా కొండంతగా గోచరిస్తుంది. కాబట్టి వారి ఈ సున్నిత పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మరీ మెలగాలి. తమ ప్రవర్తన వల్లను, మాటల వల్లను తల్లిదండ్రులకు బాధ కలిగే అవకాశం ఇవ్వరాదు.

అమ్మా నాన్నలను కనికరం లేక కసిరికొట్టి బయటికి నెట్టే కన్నబిడ్డలెంతటి కఠినాత్ములు! ఎంతటి క్రూరులు! ఎంతటి మూర్ఖులు! ఎంతటి నిర్ధయులు! ఎంతటి పాషాణ హృదయులు! చనిపోయాక కట్టే చలువరాతి సమాధులకన్నా ముసలితనాన ఇంత ముద్ద పెట్టే చేతులే మిన్న అన్న కాసింత ఇంగిత జ్ఞానముండాలి.

బిడ్డలు జీవించి ఉండగా ఏ అమ్మా అనాథ కాకూడదు. ఏ అమ్మకూ ఆప్యాయతానురాగాల కరువు రాకూడదు. ఏ మాతృమూర్తీ ఒంటరి తనంతో కుమిలిపోకూడదు. ఏ తల్లికీ అనాథాశ్రమాలలో బ్రతకాల్సిన హీన స్థితి రాకూడదు. మీ కంఠంలో ఊపిరి ఉన్నంత మేర మీ అమ్మ కంట తడిపెట్టకూడదు. మీ అమ్మ గుండె ఆవేదనతో బరువెక్క కూడదు. ఆకలితో ఆమె కడుపు ఆక్రోశించకూడదు. అలసటతో ఆమె శరీరం సొమ్మసిల్లకూడదు. బాధలు తెలియకుండా బిడ్డల నీడలో ఆమె హాయిగా, స్వేచ్ఛగా,చల్లగా ఉండాలి. చిరునవ్వు ఆమె ముఖంపై చిరువెన్నెలలా ప్రకాశించాలి. సంతృప్తి ఆమె బ్రతుకులో అణువణువునా పులకించాలి. ఆనందం ఆమె జీవితంలో వీడని నీడ కావాలి.

ఈ విధంగా తల్లిదండ్రుల సేవ చేయడం వల్లనే ఇహపరలోకాల్లో శు భం, గౌరవం, ఉన్నతి లభిస్తాయి.



హుమేరా అమీర్,
ఏలూరు

# వితంతువుల పట్ల వివక్ష వద్దు

**మహిళలకు ప్రపంచంలోని సమస్యలన్నీ ఒక ఎత్తైతే వైధవ్యం అనేది మరొక ఎత్తు. కేవలం భర్తను కోల్పోయిన వితంతువులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమాజాల్లో బహిష్కరించ బడుతున్నారు, వారు జీవనోపాధి, ఆస్తులను కోల్పోతున్నారు, ఎన్నో అవమానాలకు గురవుతున్నారు, సింగిల్ పేరెంట్‌గా మిగిలి పోయి, పిల్లలను పోషించలేకపోతున్నారు, పేదరికంతో కూడిన జీవితానికి బందీలుగా మారిపోతున్నారు.**

### కారణాలు

ఐక్యరాజ్యసమితి 2010 అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 258 మిలియన్ల కంటే ఎక్కువమంది వితంతువులు ఉన్నారు. అప్పటి నుండి సుమారు 10 శాతం కంటే ఎక్కువమంది వితంతువులు పెరుగుతున్నారు. ఈ వితంతువులలో దాదాపు పది మందిలో ఒకరు తీవ్రమైన పేదరికంలో మగ్గుతున్నారు. కరోనా తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగింది. వితంతు సమస్యకు దోహదపడే అంశాలలో ముఖ్యమైనది వివాహ వయస్సు. భార్యా భర్తల మధ్య ఎక్కువ వివాహ వయస్సు తేడా ఉండడం కారణంగా పురుషులు ముందుగా చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది కాబట్టి స్త్రీలు వితంతువులుగా మారే అవకాశం ఎక్కువగా ఉంది. దీనితో పాటు సాయుధ ఘర్షణలు, అంతర్యుద్ధాలు, అనారోగ్యాలు మొదలైన కారణాలు ఉన్నాయి.

### వితంతువులకు ఎదురయ్యే సమస్యలు

వితంతువులు ఎదుర్కొనే అతి పెద్ద సమస్య ఆర్థిక సమస్య. అప్పటివరకూ భర్త సంపాదనతో, భర్త సంరక్షణలో ఎంతో హుందాగా, ఆనందంగా గడిచిన మహిళల జీవితాలు, వారి పిల్లల జీవితాలు భర్త మరణంతో రోడ్డున పడుతున్నాయి. కుటుంబాన్ని గడపడం కోసం ఉపాధిని అన్వేషిస్తూ రోడ్డున పడడం ఒక సమస్య అయితే, భర్తను కోల్పోయిన మహిళగా ఆమె ఎదుర్కొనే సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ఒంటరి మహిళపై పడే అనేక వేల డేగకళ్ళు, వితంతువులు ఎదురవగానే చీదరింపులు, ఛీత్కారాలు, వితంతువులు దురదృష్టానికి సూచికలు అంటూ ఎత్తిపొడుపులు, ఇలా ఒకటి కాదు, ఒక మహిళ వితంతువుగా మిగిలిందంటే వేలాది ప్రశ్నలు, సమస్యలు అనుక్షణం ఆమెను వెంటాడుతూ ఉంటాయి. ఈ సమస్యలన్నీ ఏ జంతువుల నుండో, క్రూరమృగాల నుండో కాదు. మానవత్వం అనే లక్షణాలు లేని మనుషుల నుండే ఆమె ఎదుర్కొంటుంది.

ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో లక్షలాది మంది వితంతువులు, వారిపై ఆధారపడినవారు ఎదుర్కొంటున్న అనేక సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం, వితంతువు సమస్యపై అవగాహన పెంచడానికి ఐక్యరాజ్యసమితి ఆమోదించిన కార్యాచరణ దినమే

ఈ అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం. దీనిని ప్రతి సంవత్సరం జూన్ 23న నిర్వహిస్తారు.

## యుఎన్ఓ సాధారణ సభలో...

న్యూయార్క్‌లో డిసెంబర్ 21, 2010 న జరిగిన ఐక్యరాజ్యసమితి 65వ జనరల్ అసెంబ్లీ 75వ ప్లీనరీ సమావేశం కొరకు జనరల్ అసెంబ్లీ హాల్లో గాబన్ రిపబ్లిక్ (ఇది ఈక్వటోరియల్ గినియా, కామెరూన్ మరియు కాంగో రిపబ్లిక్ సరిహద్దులో ఉన్న ఆఫ్రికాలోని అట్లాంటిక్ తీరంలో ఉన్న ఉప-సహారా దేశం) అధ్యక్షుడు అలీ బొంగో ఒండింబా ఒక ప్రసంగం చేశారు. పేదరికాన్ని నిర్మూలించాలంటే వితంతువులతో సహా మహిళల ఆర్థిక సాధికారత చాలా ముఖ్యమైనదని అధ్యక్షుడు ఒండింబా తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. వితంతువులు, వారి పిల్లల ఆర్థిక, సామాజిక దుస్థితిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్య గురించి అవగాహన పెంచాలని అన్ని సభ్య దేశాలు, ఐక్యరాజ్యసమితి, ఇతర అంతర్జాతీయ సంస్థలకు ఆయన పిలుపునిచ్చారు. ఆ రోజు ఆయన చేసిన ప్రసంగం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది వితంతువుల దుస్థితిని కళ్ళకు కట్టినట్టు చూపించింది. 21 డిసెంబర్ 2010న, ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో గాబన్ అధ్యక్షుడు అలీ బొంగో ఒండింబా ప్రవేశపెట్టిన ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదిస్తూ, ''జూన్ 23న అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం''గా అధికారికంగా ప్రకటించటం జరిగింది. 2010లో ఆరవ అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం నాటికి, రువాండా, శ్రీలంక, యునైటెడ్ స్టేట్స్, యూకే, నేపాల్, సిరియా, కెన్యా, భారతదేశం, బంగ్లాదేశ్ మరియు దక్షిణాఫ్రికాలో వివిధ కార్యక్రమాలకు శ్రీకారం జరిగాయి.

## మన దేశంలో

మిగిలిన దేశాల సంగతి ఎలా ఉన్నా మన భారతదేశంలో ఈ వితంతు వివక్ష మరీ ఎక్కువే అని చెప్పాలి. ఒకసారి భర్తను కోల్పోయిన మహిళ / బాలికకు మరో వివాహం అనేది ఒకప్పుడు కలలో కూడా ఊహించలేని విషయం. భారతదేశంలో వితంతువులకు పునర్వివాహాన్ని అనుమతించే చట్టపరమైన, సామాజిక మార్పు 1856 లో హిందూ వితంతు పునర్వివాహ చట్టం అమలు కారణంగా వచ్చింది. ఆచార సాంప్రదాయాల పేరుతో అప్పటి వరకూ ఎన్నో దారుణాలకు ఆలవాలంగా ఉండే మహిళల జీవితాలకు ఈ చట్టం ఒక భరోసాను ఇచ్చింది. ఈ చట్టం భారత దేశ హిందూ మహిళ జీవితాలను గణనీయంగా ప్రభావితం చేసింది. వితంతు పునర్వివాహాన్ని సమర్థించడంలోనూ, ఈ మార్పు కోసం వాదించడంలో పండిట్ ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ కీలక పాత్ర పోషించారు, రాజ్యాంగంలో ఈ చట్టాన్ని చేర్చాలని ఆయన చాలా ఒత్తిడి చేశారు. సాంప్రదాయ ఆచారాలు, పద్ధతులను సవాలు చేస్తూ ఈ చట్టం భారతదేశ హిందూ మహిళలకు వితంతు పునర్వివాహాన్ని చట్టబద్ధం చేసింది. బ్రిటిష్ రాజ్ అమలు చేసిన హిందూ వితంతు పునర్వివాహ చట్టం, 1856 హిందూ మహిళలకు వితంతు పునర్వివాహాన్ని చట్టబద్ధం చేయడమే కాదు, వితంతువులు పునర్వివాహం చేసుకోవడం అనేది వారి హక్కు అని చెప్పింది. అంతేకాదు ఈ పునర్వివాహితుల సంతానానికి చట్టబద్దమైన రక్షణ కల్పించింది.

## హిందూ వితంతు పునర్వివాహ చట్టం

ఏ విషయంలో అయినా సామాజిక మార్పు అనేది అంత తొందరగా వచ్చే విషయం ఏమీ కాదు. సంప్రదాయాల పేరుతో రకరకాల మూఢనమ్మకాలతో విరాజిల్లే మన చుట్టూ ఉండే ప్రపంచంలో ఈ మార్పు మరీ కష్టం. ఈ హిందూ పునర్వివాహ చట్టం హిందూ సమాజంపై గణనీయమైన ప్రభావాన్ని వేసింది. భారతదేశంలో కొన్నిరకాల సంప్రదాయ పద్ధతులను సవాలు చేసే విధంగా ఈ చట్టం ఉండడంవల్ల అప్పట్లో ఈ చట్టం చాలా వివాదాస్పదమైంది కూడా. ముఖ్యంగా అగ్రవర్ణ హిందువులు దీనిని అంగీకరించలేకపోయారు. కానీ అది క్రమంగా ఆమోదం పొందింది, అనేక మంది వితంతువుల జీవితాలను మెరుగు పరచడంలో సహాయపడింది. విద్యాసాగర్‌తో పాటు, రాజా రామ్మోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు, ప్రొఫెసర్ డి.కె. కార్వే, మరెందరో సంఘ సంస్కర్తలు కూడా వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించడంలో గణనీయమైన కృషి చేశారు. భారతదేశంలో సామాజిక సంస్కరణల చరిత్రలో ''హిందూ వితంతు పునర్వివాహ చట్టం'' ఒక మైలురాయి విజయంగా పరిగణించబడుతుంది.

## ఇస్లామ్‌లో...

ఇస్లాం మతం స్త్రీ వితంతువు అయితే తిరిగి వివాహం చేసుకోవడానికి అనుమతిస్తుంది. ఎన్నిసార్లు ఆమె వితంతువు అయినప్పటికీ, మరోసారి ఆమె వివాహం చేసుకోవడానికి ఆమెకు అనుమతి ఉంది. అది కూడా గౌరవనీయమైన అనుమతి. ఆమె ఎన్నిసార్లు వితంతువుగా మారినప్పటికీ, సమాజంలో ఆమె తన గౌరవాన్ని కోల్పోదు. ఎటువంటి అపరాధ భావన లేకుండా తనకు తగిన జీవిత భాగస్వామిని ఎంపికచేసుకుని, మరోసారి తన వైవాహిక జీవితాన్ని ప్రారంభించి, జీవితాన్ని ఆస్వాదించే హక్కు ఆమెకు ఉంది.

ఇస్లాంలో బహుభార్యాత్వం అనగా ముస్లిం పురుషులు ఒకేసారి ఒకరి కంటే ఎక్కువ మంది మహిళలను వివాహం చేసుకోవడానికి అనుమతి ఉంది. దీని వెనుక చాలా కారణాలు ఉన్నప్పటికీ మగవారికి ఇస్లాం అనుమతించిన నాలుగు వివాహాల అనుమతికి గల కారణాలలో ఒక ముఖ్యమైన కారణం ఈ వితంతు సమస్య. అనారోగ్యం, ప్రమాదాలు, యుద్ధాలు వంటి కొన్ని కారణాల వల్ల పురుషులు ఎక్కువగా మరణిస్తున్నందున సమాజంలో వితంతువుల సమస్య పెరిగిపోయింది. అనేక యుద్ధాలలో భర్తలను కోల్పోయిన మహిళలు, వారి పిల్లల పోషణార్థం, సమాజంలో వారికంటూ ఒక గౌరవప్రదమైన జీవితాన్ని ప్రసాదించడం కోసం సృష్టికర్త అయిన అల్లాహ్ విశ్వాసులైన మగవారికి ఈ విధంగా నాలుగు వివాహాలను అనుమతించడం జరిగింది.

క్రీ.శ. 625లో ఉహుద్ యుద్ధంలో ఎందరో ముస్లిం పురుషులు ఇస్లాం కోసం పోరాడుతూ ప్రాణాలు కోల్పోయారు. ఆ యుద్ధంలో అనేక మంది ముస్లిం పురుషుల మరణం కారణంగా అనేక మంది వితంతువులుగా మారిపోయారు. అప్పుడు అల్లాహ్ ఈ బహు భార్యాత్వ ఆదేశాలను జారీ చేయడం జరిగింది. పురుషులు సామాజిక భద్రతను అందించడానికి వితంతువులను వివాహం చేసుకోవాలని ప్రోత్సహించే ఈ ఆదేశాలను ఇవ్వడం జరిగింది.

ఒక పురుషుడు ఒకేసారి ఒకరి కంటే ఎక్కువ మంది మహిళలను వివాహం చేసుకోవడానికి అనుమతించడం ద్వారా మాత్రమే పురుషుల కంటే ఎక్కువ మంది మహిళలు ఉన్న పరిస్థితిని పరిష్కరించవచ్చు.

## ప్రవక్త(స) ఆదర్శం

ముహమ్మద్ ప్రవక్త (స) భార్యలలో హజ్రత్ ఆయిషా (ర) తప్ప మిగిలిన వారంతా వితంతువులు, విడాకులు తీసుకున్న మహిళలే. ఆయన తన 25 సంవత్సరాల వయస్సులో హజ్రత్ ఖదీజా (ర) అనే 40 సంవత్సరాల వయస్సు కలిగిన వితంతువును మొదటి వివాహం చేసుకున్నారు. అత్యంత దుర్బల వర్గంగా భావిస్తున్న వితంతువులకు భద్రత, ఆర్థిక మద్దతు అందించడంలో ఆయన (స) తన అనుచరులకు ఒక ఉదాహరణగా నిలిచారు.

వితంతువులంటే వారేమీ తక్కువ గౌరవం కలిగిన వారు కాదనీ, వితంతువులకు వివాహ ప్రతిపాదన కూడా ఎంతో గౌరవంగా పంపించాలని కూడా సూచించడం జరిగింది.

> **"ఈ వితంతువులను వివాహం చేసుకోవాలనే మీ సంకల్పాన్ని మీరు వారి నిరీక్షణాకాలం (ఇద్దత్)లో పరోక్షంగా తెలిపినా లేక దానిని మీ మనస్సులలో గోప్యంగా ఉంచినా అది దోషం కాదు. వారిని గురించిన ఆలోచన సహజంగానే మీకు కలుగుతుందని అల్లాహ్‌కు తెలుసు. కాని రహస్యంగా ఎలాంటి ఒప్పందం చేసుకోరాదు. అయితే మీరేమన్నా మాట్లాడదలిస్తే గౌరవమైన రీతిలో మాట్లాడండి. నిరీక్షణా వ్యవధి (ఇద్దత్) పూర్తి కానంత వరకు వివాహ నిర్ణయం తీసుకోకూడదు. మీ మనస్సులలో ఉన్న విషయం సహితం అల్లాహ్‌కు తెలుసు అని తెలుసుకోండి. కనుక ఆయనకు భయపడండి. ఇంకా ఆయన అత్యంత సహనశీలుడని (చిన్న చిన్న తప్పులను) మన్నిస్తాడని కూడా తెలుసుకోండి". (దివ్య ఖుర్ ఆన్ 2: 235).**

ప్రపంచవ్యాప్తంగా వితంతువుల సమస్యల గురించి ఆలోచించినప్పుడు ఇస్లాంలో వితంతువుల స్థితి చర్చించదగిన అంశం. వితంతు పునర్వివాహం, ఆస్తి వారసత్వం, వారి ఇతర హక్కుల గురించి ఖుర్‌ఆన్ స్పష్టంగా బోధించింది. చాలామందికి ఉండే అనుమానం ఏమిటంటే ఒకవైపు వితంతు వివాహాలను ప్రోత్సహించే ఇస్లాం మరోవైపు భర్త మరణం తర్వాత ఆమెను ఇద్దత్ (గడువు) పేరుతో నాలుగు నెలల పది రోజులు ఇంటికే పరిమితం చేయడం అన్యాయం కదా అంటారు.

> **"మీలో ఎవరైనా మరణించి, వారి భార్యలు సజీవంగా ఉంటే, వారు నాలుగు నెలల పదిరోజుల వరకు తమను తాము నిగ్రహించుకోవాలి. ఈ గడువు (ఇద్దత్) పూర్తి అయిన పిదప, వారు తమ కొరకు ఏది ఉచితమో దానిని యుక్తమైన రీతిలో చేసుకోవటానికి స్వేచ్ఛ కలిగి ఉన్నారు. దానికి మీరు బాధ్యులుకారు. మీరు చేసే పనులన్నీ అల్లాహ్‌కు తెలుసు". (దివ్య ఖుర్ ఆన్ 2:234)**

ఈ ఖుర్‌ఆన్ ఆయత్ ప్రకారం భర్త మరణించిన తర్వాత ఒక వితంతువు నాలుగు నెలల పది రోజుల పాటు నికాహ్ (వివాహ ఒప్పందం)లో చేసుకోకూడదని స్పష్టంగా తెలుస్తుంది. విడాకులు తీసుకున్న స్త్రీకి అయితే ఈ గడువు కాలం మూడు నెలలు. స్త్రీ ఇద్దత్ కాలాన్ని పాటించాలని దైవం ఆదేశించడానికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది భర్త మరణం ఆమెకు ఒక షాక్. స్త్రీ తన భర్త మరణానికి దుఃఖిస్తూ ఉంటుంది, నిరాశా, నిస్పృహలకు గురై మానసిక సమస్యలను ఎదుర్కొంటూ ఉంటుంది. ఒక వితంతువుకు తన బాధను మర్చిపోవడానికి, భావోద్వేగాలను అణచుకోవడానికి ఈ సమయం ఉపయోగపడుతుంది. రెండవది, ఇస్లాం పిల్లల తండ్రి గుర్తింపుకు సంబం

ధించిన కఠినమైన నియమాలను కలిగి ఉంది. అందువల్ల, నాలుగు నెలల కాలం అంటే వితంతువు తన మరణించిన భర్త కారణంగా గర్భవతి అవునా? కాదా? నిర్ధారించుకోవాల్సిన సమయం అన్నమాట. ఒకవేళ ఆమె గర్భవతిగా ఉన్నట్లయితే, ఆమె బిడ్డను ప్రసవించే వరకు ఆమె మరో వివాహం కోసం వేచి ఉంటుంది.

## ఆస్తి హక్కు

ఇస్లాం స్త్రీకి అన్నిరకాల ఆర్థిక హక్కులను ఇచ్చింది. ఆమెకు తన తండ్రి ఆస్తి నుండి వాటాను ఇస్తుంది, ఒక స్త్రీకి కూడా తన కొడుకు ఆస్తిలో వాటా లభిస్తుంది. వివాహ సమయంలో భర్త నుండి మహర్ పొందుతుంది. భర్త మరణానంతరం ఒక వితంతువుకు తన భర్త ఆస్తిలో కూడా వాటా ఇవ్వబడుతుంది.

ఇస్లాంలో ఒక వితంతువు తన మరణించిన భర్త ఆస్తిలో వాటాకు స్పష్టంగా అర్హురాలు అని అల్లాహ్ ఖుర్ఆన్‌లో స్పష్టంగా చెప్పి ఉన్నాడు. ''మీకు సంతానం లేనిపక్షంలో మీరు విడిచిపోయే ఆస్తిలోని నాలుగో భాగానికి వారు (మీ భార్యలు) హక్కుదారు లవుతారు. కాని మీరు సంతానవంతులైతే అప్పుడు వారికి ఎనిమిదో భాగం లభిస్తుంది. ఇది మీరు వ్రాసిన వీలునామాను అమలు జరిపిన తరువాత, మీరు చేసిన అప్పులు తీర్చిన తరువాత జరగాలి. (దివ్య ఖుర్ఆన్ 4:12)

భర్త మరణించిన తర్వాత, తన పిల్లలకు ఆహారం, ఆశ్రయం కల్పించే బాధ్యత కేవలం ఆ ఒక్క వితంతువు బాధ్యత మాత్రమే కాదు. పిల్లల పెంపకంలో వితంతువు భారాన్ని ఇస్లాం తగ్గిస్తుంది. మరణించిన తండ్రి తర్వాత, తాత బిడ్డలకు సంరక్షకుడు అవుతాడు. తాత లేనప్పుడు, సంరక్షకుడిని నిర్ణయించి, పిల్లల అన్ని ఆస్తులు, ఖర్చులను నిర్వహించే అధికారం రాజ్యానికి ఉంటుంది.

ఇస్లాం వితంతువులకు ఎటువంటి వివక్షత లేకుండా స్వేచ్ఛ, సమానత్వపు హక్కులను అందిస్తుంది. వారు సామజిక, ఆర్థిక, రాజకీయ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనడానికి పూర్తి స్వేచ్ఛను కలిగి ఉన్నారు. మతపరమైన, సామాజిక వేడుకలలో పాల్గొనడానికి వారికి ఎటువంటి పరిమితులు గానీ, వివక్షలు గానీ లేవు.

## ఏమిటి, ఆమె చేసిన నేరం?

జీవిత భాగస్వామి మరణం వల్ల కలిగే గాయం స్త్రీ, పురుషులిద్దరికీ సమానంగా ఉన్నప్పటికీ, భాగస్వామి మరణం స్త్రీలను ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. చాలామంది, స్త్రీ తన భర్త మరణానికి కారణంగా మాట్లాడుతారు. ఆమె జాతకాన్ని నిందిస్తారు. నిజానికి మంచీ, చెడులు దైవాధీనాలు. ప్రతి మనిషి మరణ ఘడియలు అల్లాహ్ చేతిలో ఉన్నాయి. మరణం గురించి ఖురాన్ విస్తృతంగా చర్చిస్తుంది. ''చివరకు ప్రతి మనిషీ మరణిస్తాడు. (దివ్య ఖుర్ ఆన్ 3: 185). ''ప్రతి ప్రాణి మరణాన్ని రుచి చూడవలసి ఉన్నది. (దివ్య ఖుర్ ఆన్ 29:57).

వితంతువు అనగానే సమాజం వారికి తక్కువ హోదా ఇస్తుంది. శతాబ్దాలుగా, వితంతువులు తమ జీవితాంతం పక్షపాతం, అన్యాయాన్ని భరిస్తున్నారు. సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ వితంతువులు మాత్రం ఇప్పటికీ వారి దైనందిన జీవితంలో దుర్భరమైన పరిస్థితులనే ఎదుర్కొంటున్నారు అనడంలో సందేహం లేదు. ఒంటరితనం, వేధింపుల ముప్పు కారణంగా ఈ రోజు వితంతువులు తక్కువ ఆదాయం ఉన్నప్పటికీ వారికి భద్రతా భావాన్ని ఇచ్చే ఉద్యోగాలు చేయడానికి మాత్రమే ఇష్టపడుతున్నారు.

భార్య చనిపోయిన తర్వాత భర్తలు అనుసరించే సామాజిక, సాంస్కృతిక బాధ్యతలు, కట్టుబాట్లు లేనప్పుడు, భర్తను కోల్పోయిన భార్యపై మాత్రమే ఎందుకు ఇన్ని కఠినమైన సామాజిక నమ్మకాలు, నిర్ణయాలను మనం రుద్దుతున్నాం అనేది అందరూ ఆలోచించవలసిన విషయం. ఇటువంటి దుర్భర పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఉన్నాయి.

## ఆమెకు ఆదరువుగా ఉండాలి

జీవిత భాగస్వామిని కోల్పోవడం ఒక స్త్రీని మరింత దుర్బలంగా చేస్తుంది. ఆమె తన కుటుంబంలోనే కాకుండా సమాజంలో కూడా అవమానం, ఒంటరితనాన్ని ఎదుర్కొంటుంది. అటువంటి సమయంలో వ్యక్తిగతంగానూ, సమాజ పరంగానూ ఆమెకు మద్దతు ఇవ్వాలి. భర్త మరణం తర్వాత స్త్రీని మానసికంగా హింసించడంతో పాటు భౌతికంగా వైధవ్యాన్ని అందరిముందు ప్రదర్శించడం మానేయాలి. భర్త ఉన్నప్పుడు ఒక విధంగా, భర్త మరణించిన తర్వాత ఒక విధంగా ఆమె అలంకరణకు హద్దులు విధించడం మానేయాలి. దైవం అనుమతించిన అన్ని రకాల వేడుకలలో పాల్గొనడానికి వితంతువులు హక్కుదారులు అని గుర్తించాలి. బలమైన సామాజిక-ఆర్థిక, విద్యా, హోదా కలిగిన వారుగా వితంతువుల జీవితాలను మార్చి సాధికారత దిశగా వారి జీవితాలను విజయవంతంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వాలతో పాటు ఈ సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉంది.

# శ్రేయోభిలాషా! నీ పేరే ఇస్లామ్



- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**తాను తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేడని స్వయంగా అల్లాహ్‌యే సాక్ష్యమిస్తున్నాడు. సర్వశక్తిమంతుడు, మహావివేకి అయిన ఆయన తప్ప మరో నిజ దేవుడు లేడని దైవ దూతలు, నీతిమంతులైన జ్ఞానసంపన్నులు సాక్ష్యమిస్తున్నారు.**

అల్లాహ్ దగ్గర (ఆమోదిత) ధర్మం ఇస్లాం మాత్రమే. కాని గ్రంథప్రజలు తమకు జ్ఞానసంపద లభించినప్పటికీ, పరస్పరం విభేదాలలో పడి మంకుతనంతో ఇలాంటి ధర్మాన్ని కాదని విభిన్న మార్గాలు అవలంబించారు. అల్లాహ్ వచనాలను తిరస్కరించిన వారిని అల్లాహ్ త్వరలోనే నిలదీసి లెక్క తీసుకుంటాడు.

ప్రతి మనిషికీ ఒక ఆలోచన ఉంటుంది. దాని ప్రకారమే అతను జీవితాన్ని గురించి, సృష్టిని గురించి ఒక అభిప్రాయం ఏర్పరచు కుంటాడు. మరి దానికనుగుణంగానే ఏదో ఒక దానికి ప్రాధాన్యత ఇస్తాడు. దాన్నే తన విశ్వాసాలకు, శ్రద్ధాసక్తులకు కేంద్ర బిందువుగా చేసుకుంటాడు. మరి దానికనుగుణంగా తాను సమాజంలో ఆచరిస్తాడు. ఈ మూడింటినే విశ్వాసం, ఆరాధన, నడవడి అని అనవచ్చు. ఈ మూడు వస్తువుల సమాహారానికి మరో పేరే దీన్ (ధర్మం). ఈ రకంగా చూసినప్పుడు ప్రతి మనిషికీ అతను ఏ మతావలంబీకుడైనా, నాస్తికుడైనా... ఒక దీన్ (ధర్మం) అనేది ఉంటుంది.

ఇక ఇస్లాం అంటే ఏమిటి? నిఖిల జగతి వెనుక ఒకానొక శక్తిమంతుడున్నాడని, ఆయన సంకల్పమే దీని వెనుక పనిచేస్తోందనీ, ఆయనే దీనికి కర్త, పోషకుడని మనిషి గుర్తించాలి. ఆయన సమక్షంలోనే ప్రతి ఒక్కరి లెక్క తేలవలసి ఉందని, ఆయన సన్నిధిలో సత్యంగా ఖరారయ్యేదే సత్యమని, ఆయన ఎదుట మిథ్యగా ఖరారయ్యేదే మిథ్య అని మనిషి నిష్కల్మష హృదయంతో నమ్మాలి. ఇదే ఇస్లాం అంటే.

మానవమూర్తి ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: నిశ్చయంగా, అల్లాహ్ నాకు ప్రసాదించిన మార్గదర్శకత్వం, జ్ఞానం ఉదాహరణ భూమిపై కురిసిన వర్షం లాంటిది. దానిలో కొంత భూభాగం సారవంతమైనది, వర్షాన్ని తీసుకుని సమృద్ధిగా గడ్డి, మూలికలను ఉత్పత్తి చేసింది. మరికొంత భూభాగం లోతట్టు ప్రాంతం. (చెరువులు, చెలమలు, మడుగులు, కుంటలు, కాలువలు, నదులు)- వంటిది. అది నీటిని నిలుపుకుంది. అల్లాహ్ దాని ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూర్చాడు. వారు దాని నీళ్లు తాగి, పొలాలకు నీళ్లు మళ్లించి పంటలు పండించారు. ఇంకొంత భూభాగం బండరాతి నేల వంటిది. అది నీటిని నిలుపుకోలేదు, ఎలాంటి పంటను, పచ్చిక బయళ్లను ఉత్పత్తి చేయలేదు. (దాని వల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం దక్కలేదు). అల్లాహ్ ధర్మాన్ని అర్థం చేసుకుని, అల్లాహ్ తనకు ఇచ్చి పంపిన దాని నుండి ప్రయోజనం పొందిన వ్యక్తి, ప్రయోజనం పొందలేక పోయిన వ్యక్తి ఉదాహరణ ఇది, (సహీహ్ ఇబ్ను హిబ్బాన్)

మనిషి నిజ దైవమైన అల్లాహ్‌ను తెలుసుకోవడం అనేది ఏమీ 'లేని' వాడు సర్వం 'కలిగి' ఉన్న వాడిని పొందడం వంటిదే!

కాబట్టి ఎవరయితే ఈ సత్యాన్ని పొందుతాడో అతను తన పూర్తి అస్థిత్వంతో సహా ఓ క్రొత్త మనిషి అయిపోతాడు. అతని జీవితం ఓ కరుణా సాగరంలో జలకాలాడుతుంది. అది ఎటువంటి పరిశోధనంటే, అది అతని మనో మస్తిష్కాలను తన అదుపులోకి తీసేసుకుంటుంది. అతనేది చూసినా, ఏది విన్నా దివ్య దృష్టితో చూస్తాడు. వింటాడు. అతని భావాలు భావనల జగత్తు ఇప్పటి వరకు అంధకారబంధురమై ఉండేది. ఇప్పుడు అందులో శుభోదయ కిరణాలు ప్రసరించాయి. ఇప్పుడతని వ్యక్తిత్వం ధగధగా మెరిసిపోతోంది. పవిత్రమైన ఈ భావాల మూలంగా ఇప్పుడతను ఆసాంతం అల్లాహ్ వాడైపోతాడు.

శ్రద్ధ లేని అభ్యాసం, వివేకం లేని విద్య, నేర్పు లేని వికాసం, ఓర్పు లేని ఆవేశం, ఇంధనం లేని వాహనం లాంటివి- అన్నీ మిళితమైతేనే వాహనమైనా, జీవితమైనా ముందుకు సాగేది. దేహం మీద మోహం, కామం (కోరిక)మీద ఆసక్తి, ధనం మీద ధ్యాస, భోగం మీద రక్తి - ఆధ్యాత్మిక ప్రమాణాలకు అడ్డంకులు. మానవాత్మ సాక్షి! దాన్ని తీర్చిదిద్ది పాపపుణ్యాల్ని గురించి తెలిపినవాడి సాక్షి! నిస్సందేహంగా ఆత్మప్రక్షాళన చేసుకున్నవాడు ధన్యుడు. అంతరాత్మను అణచిపెట్టినవాడు నాశనమవుతాడు.
(అష్-షమ్స్: 7-10)

సత్యం మాట్లాడే నైజం, మంచిని మెచ్చుకునే గళం, సహాయం చేసే తత్వం, ధర్మం ఆచరించే భక్తి, ప్రేమతో నిండిన నవ్వు - ఇవే పరిపూర్ణ జీవితానికి ప్రతీకలు అంటుంది ఇస్లాం.

తత్ఫలితంగా సాటి సోదరుల పట్ల అతని ప్రవర్తనలో అనూహ్యమైన మార్పు వచ్చేస్తుంది. తోటి మానవ సోదరుల పట్ల ఇప్పుడతను ఒకే దేవుని దాసుడుగా మెలుగుతాడు. ప్రజలు అహంభావం ప్రదర్శించిన చోట ఇతను అణకువను, వినమ్రతను ప్రదర్శిస్తాడు. ప్రజలు ప్రతీకార వాంఛతో పెట్రేగిపోతున్న చోట అతను మన్నింపుల వైఖరిని అవలంబిస్తాడు. ప్రజలు తమ స్వలాభాలకోసం బంధుత్వ సంబంధాలను విచ్ఛిన్నపరుస్తుంటే, ఇతనేమో సత్యం కొరకు సత్సంబంధాలను మెరుగుపరచుకుంటాడు. ప్రజలు దేన్నయినా ఆర్జించి సంతృప్తులైతే, ఇతను పరులకు ప్రయోజనం చేకూర్చి ఆనందిస్తాడు. ప్రజలు ప్రాపంచిక జిలుగు వెలుగుల వైపునకు ఎగబడుతుంటే ఇతను మాత్రం అగోచరమైన పారలౌకికంలో తనను లీనం చేసుకుంటూ ఉంటాడు - ప్రవక్త ద్వారా మనిషికి తెలుపబడిన పవిత్ర జీవితం ఇదే. ఎవరయితే ఈ విధంగా ఒకే దైవాన్ని ఆరాధిస్తారో, ఒకే ప్రవక్తను అనుసరిస్తారో, ఒకే గ్రంథాన్ని ఆశ్రయిస్తారో, ఒకే ధర్మాన్ని ఆచరిస్తారో వారు సహజంగానే పరస్పరం సంఘటితమవుతారు.

**అహం హద్దులు మీరితే బంధాలు బలహీనమవుతాయి, ఆశ హద్దులు మీరితే అనుబంధాలు అవహేళనకు గురవుతాయి, స్వార్థం హద్దులు మీరితే రక్తసంబంధాలు రక్తసిక్తం అవుతాయి, ద్వేషం వదలి ప్రేమ భావం పెరిగితే బంధాలు అనుబంధాలుగా మారి తరతరాలు తరించి పోతాయి అంటుంది ఇస్లాం.**


తాము తమ కొరకు అవలంబిస్తున్న మేలును పరులకు కూడా అందించడానికి సమాయత్తమవుతారు. వారి బాహ్య జీవితం వారి అంతరంగాన్ని ప్రతిబింబిస్తూ ఉంటుంది.

ఇక షైతానీ క్యారెక్టర్ (పైశాచిక గుణాలు) ఉన్న మనిషి స్వభావం ఎలా ఉంటుందో చూద్దాం. ఈ కోవకు చెందినవాడు ఏదయినా అవాంఛనీయమయిన పరిస్థితి ఏర్పడినప్పుడల్లా నిర్లక్ష్యంగా ప్రతిస్పందిస్తాడు. అతను ద్వేషంతోనే ఎదిరిస్తాడు. కోపానికి సమాధానం కోపంతోనే ఇస్తాడు. దీనికి భిన్నంగా దైవికమయిన క్యారెక్టర్ ఉన్న వాడెవడంటే, అతను దైవానికి భయపడుతూ ఉంటాడు. అతను భావావేశాలను నిగ్రహించుకుని, రాగద్వేషాలతో కూడిన మనోమయ భావాల నుంచి పైకి వచ్చి వ్యవహారం చేస్తాడు. అంతిమ దైవప్రవక్త (స) ప్రబోధించారు: నా ప్రభువు నాకేమని ఆజ్ఞాపించాడంటే నాకు దూరమైన వానితో నేను సన్నిహితం కావాలి. నాకు ఏదయినా దక్కకుండా చేసిన వాడికి నేను ఏదైనా ఇవ్వాలి. నాకు అన్యాయం చేసినవాడ్ని, నేను క్షమించాలి. (సహీహ్ అత్తర్ఘీబ్)

ఇలాంటి ఆదేశాలు అనేకం ఉన్నాయి. వీటి ద్వారా బోధపడేదేమంటే విశ్వాసి (మోమిన్) అయినవాడు ఎదుటివారి వైఖరిని బట్టి గాక తన స్థాయికి శోభించే విధంగా ప్రవర్తించాలి. నకారాత్మక వైఖరి ప్రదర్శించ బడినప్పుడల్లా అతను, సకారాత్మకంగా ప్రతిస్పందించాలి. ప్రజల మధ్య కలసిమెలసి జీవిస్తున్నప్పుడు అవాంఛనీయమయిన సంఘటనలనేకం ఎదురవుతుంటాయి. తాత్కాలికంగా మనిషిలో వ్యతిరేక భావాలు జనిస్తుంటాయి. అటువంటి సందర్భాలొచ్చినప్పుడల్లా మోమిన్ (విశ్వాసి) వ్యతిరేక భావాలు లోలోనే దిగమ్రింగి. తనకు అన్యాయం జరుగుతున్నప్పటికీ ఎదుటవారి యెడల ఉత్తమ రీతిలో మెలగాలి.

ఇస్లాం మానవాళికి నిర్దేశించిన నైతికతలో విరిగిన హృదయాలను బాగుచేయడం, ప్రజల మనోభావాలను పరిగణనలోకి

**మిగతా 34వ పేజీలో...**



# నోరే నాకం
# నోరే నరకం

నసీరా బేగం

**ఒకరితో మరొకరు జరిపే సంభాషణ మనిషి జీవితంలో ఒక ముఖ్యమైన భాగం.** మనిషి ఇతరులతో ఏదైనా విషయం గురించి అడగటం కోసం లేదా తెలపటం కోసం మాటలనే ఉపయోగించ వలసి ఉంటుంది. మనిషికి ఉండే శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలు ఒక స్థానంలో పని చేస్తూ ఉంటాయి. కాని మనిషి సంభాషణ, అతను వాడే పదాలు, అతను మాట్లాడే మాటలు మనిషి వ్యక్తిత్వాన్ని వ్యక్తపరచడానికి ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. అతని మాటలు అతని వ్యక్తిత్వంపై సానుకూల ప్రభావాన్ని కలిగిస్తాయి. లేదా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తాయి.

మనిషి సంభాషణలో అతను వాడే పదాలతోపాటు మాటలతో పాటు అతని స్వరం, శైలి కూడా ప్రముఖ పాత్ర ఉంటుంది. మనిషి ఎంత జాగ్రత్తగా మాట్లాడినా, మంచి పదాలు ఎన్నుకుని మాట్లాడినా అప్పుడప్పుడు ఎదుటివాని హృదయంలో ప్రతికూల భావనలు ఏర్పడుతూ ఉంటాయి. కనుక సంభాషణ జరిపేటప్పుడు మంచి పదాలను ఎన్నుకున్నట్లే అతని సంభాషణ తీరును చక్కగా, మృదువుగా, ఆకర్షవంతంగా, అర్థమయ్యే విధంగా మాట్లాడటం కూడా చాలా ముఖ్యం.

సంభాషణలో భావోద్వేగాలది కూడా ముఖ్యమైన పాత్రే. ఈ భావోద్వేగాల ద్వారానే మనిషి ప్రేమపూర్వకంగా మాట్లాడుతున్నాడో లేదా విద్వేషపూరితంగా మాట్లాడుతున్నాడో లేదా కోపంగా మాట్లాడుతున్నాడో ఎదుటివారికి ఇట్టే అర్థమైపోతుంది. అదేవిధంగా మనిషి వాడే మాటలు అతని ఆంతర్యంలో ఏర్పడే భావోద్వేగాలను కూడా అభివ్యక్తం చేస్తాయి. ఇంకా మాటలు కూడా ఎన్నో రకాలుగా ఉంటాయి. అది ప్రేమపూర్వకమైన, అందమైన, హృదయానికి హత్తుకునే మాటలు, హృదయానికి గుచ్చుకుని గాయం చేసే వ్యంగ్యమైన మాటలు, సాధారణ సంభాషణ మాటలు, ధైర్యసాహసాలతో కూడిన మాటలు, మనోబలంతో ముందడుగులు వేయించే మాటలు, నిరాశా నిస్పృహలకు లోను చేసే మాటలు. ఈ మాటలన్నీ కేవలం మనిషి నోటితో చేసే సంభాషణ ద్వారానే వ్యక్తమవుతాయి. ఆ మాటలు ఎదుటి వారిని ప్రభావితం చేస్తాయి. అంతేకాదు, వారి జీవితాలలో వెలుగులు నింపుతాయి. లేదా చీకటిమయం చేస్తాయి. ఇంకా ఆ మాటల ద్వారా మాట్లాడే మనిషి మనస్తత్వం కూడా బయట పడుతుంది.

ఎందుకంటే మన సమాజమే అసలైన మన ప్రపంచం. ఈ ప్రపంచంలో మన జీవితం సాగుతూ ఉంటుంది. కనుక సంభాషణకు- మానవ సమాజానికి అవినాభావ సంబంధం ఉంది. అంతే ప్రాముఖ్యత కూడా ఉంది. ప్రపంచం మొత్తంలో జరిగే కార్యకలాపాలన్నీ సంభాషణ ద్వారానే జరుగుతాయి అనటంలో ఎలాంటి సందేహం లేదు. మన సంభాషణలే, మన మాటలే ప్రజలతో సంబంధాలు ఏర్పరుస్తాయి. లేదా ప్రజల మధ్య సంబంధాలను త్రెంచుతాయి. ప్రజల హృదయాలలో ప్రేమపూర్వక విత్తనాన్ని నాటుతాయి. లేదా ప్రజల హృదయాలలో విద్వేషపూరితమైన విత్తనాన్ని నాటుతాయి. ఆ విత్తనాలే పెరిగి మహా వృక్షాలవుతాయి. క్లుప్తంగా ఏమిటంటే, మన నోటి ద్వారా వెలువడే మాటలే మన జీవితాలను తీర్చిదిద్దుతాయి. లేదా చెడగొడతాయి కూడా.

సంభాషణ మరో కోణం ఏమిటంటే మన ఈ మాటలే మన పరలోక జీవితాన్ని తీర్చిదిద్దుతాయి లేదా నష్టపరుస్తాయి. మన నోటి ద్వారా వెలువడే మంచి మంచి మాటలు సత్కార్యాలను ప్రోగు చేస్తాయి. మన నోటి ద్వారా వెలువడే చెడ్డ మాటలు దుష్కార్యాలను ప్రోగు చేస్తాయి. దీని ఆధారంగానే తీర్పుదినాన తీర్పు చేయబడుతుంది.

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు; దాసుడు ఒక మాట తన నోటిద్వారా మాట్లాడతాడు. అది అల్లాహ్‌ను సంతోష పరుస్తుంది. కాని దాసుడు ఆ మాటను అంత ముఖ్యమైనదిగా భావించడు. కాని అల్లాహ్ ఆ మాట ద్వారా అతని స్థానాలను ఉన్నతం చేస్తాడు. అదేవిధంగా ఒక మనిషి ఒక మాట మాట్లాడు తాడు అది అల్లాహ్‌కు ఆగ్రహాన్ని కలిగిస్తుంది. కాని అతను ఆ మాటను అంత ముఖ్యమైనదిగా భావించడు. కాని చివరకు ఆ మాట అతన్ని నరకానికి తీసుకువెళుతుంది. (బుఖారీ)

ఒకసారి హజ్రత్ ఉమర్(ర) హజ్రత్ అబూబకర్(రజి) వద్దకు వెళ్ళారు. అప్పుడు హజ్రత్ అబూబకర్(ర) తన నాలుకను పట్టుకుని లాగుతున్నారు. అది చూసిన హజ్రత్ ఉమర్(ర) ఇదేమిటి, ఇలా చేస్తున్నారు? అని అడిగారు. అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక! నాలుకను వదిలి పెట్టండి అని కూడా అన్నారు. దానికి సమాధానంగా హజ్రత్ అబూబకర్(ర) ఇలా అన్నారు : ఈ నాలుకే వినాశనానికి గురిచేస్తోంది. నాలుక గురించి హజ్రత్ అబూబకర్(ర) లాంటి గొప్ప మనిషియే భయపడేవారు, ఆందోళన చెందేవారు.

దీనిద్వారా స్పష్టమయ్యే విషయమేమిటంటే, మంచి మాటలను పలికేది లేదా చెడ్డ మాటలను పలికేది నాలుకయే. కనుకనే దైవప్రవక్త(స) విశ్వాసి మాట్లాడితే మంచి మాటలనే పలకాలి. లేకపోతే మౌనంగా ఉండిపోవాలి అని సెలవిచ్చారు.

ఒకసారి దైవప్రవక్త ముహమ్మద్(స) తన అనుచరులను ఇలా అడిగారు: సిసలైన దరిద్రుడు ఎవరో మీకు తెలుసా? అని. దానికి ఆయన(స) గారి అనుచరులు, ఓ దైవప్రవక్తా(స) ఎవరి వద్దనైతే సంపద ఉండదో అతనే దరిద్రుడు అని అన్నారు. దానికి దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : నా సంఘానికి చెందిన పేదవాడు ఎవరంటే ప్రళయదినాన పర్వతాల మాదిరిగా సత్కార్యాలు తీసుకువస్తాడు. కాని అతను ఇహలోకంలో ఇతరుల ధనాన్ని కొల్లగొట్టి ఉంటాడు. ఇతరుల హక్కును హరించి ఉంటాడు. ఇతరులను తిట్టి ఉంటాడు. ఎవరినైనా హత్య చేసి ఉంటాడు. ఎవరినైనా దుఃఖపెట్టి ఉంటాడు. కాని ప్రళయదినం నాడు వీరందరూ తమ తమ హక్కును అడుగుతారు. అప్పుడు అతని సత్కార్యాలు వారిలో పంచివేయబడతాయి. చివరకు సత్కార్యాలు తక్కువ పడిపోతాయి. ఇంకా ప్రజల హక్కులు ఉండిపోతాయి. అలాంటప్పుడు ఆ హక్కుదారుల పాపాలు అతని లెక్కలో వేయబడతాయి. చివరకు అతన్ని ఈడ్చుకుంటూ తీసుకువెళ్ళి నరకంలోకి పడవేయటం జరుగుతుంది.

ఈ హదీసు ద్వారా తెలిసిన విషయమేమిటంటే మనిషి నాలుకకు స్వేచ్ఛ ఉందని ఏదిపడితే అది మాట్లాడితే అతను మాట్లాడే మాటలు, అతని కార్యాలు రేపు ప్రళయదినం నాడు అతన్ని పేదవానిగా, నిస్సహాయునిగా చేసివేస్తాయేమో అనే భయాన్ని మనిషి కలిగి ఉండాలి.

దైవప్రవక్త(స) సంభాషణలో తన స్వరాన్ని, తన తీరును, తన భావోద్వేగాలను సానుకూలంగా, ఆకర్షవంతంగా ఉండాలని బోధించారు. ఒకసారి ఆయన(స) ఇలా సెలవిచ్చారు; తన సోదరుని చిరునవ్వుతో పలకరించటం కూడా సదఖా చేయటం లాంటిదే. ఇంకా ఇలా సెలవిచ్చారు; ఒక విశ్వాసి ఎవరినీ శపించడు. వ్యంగ్యపు మాటల బాణాలు వదలడు. ఇంకా ఇలా సెలవిచ్చారు; ఒక విశ్వాసి మరొక విశ్వాసికి అద్దం లాంటి వాడు. అతను తన సోదరుణ్ణి నష్టం నుంచి కాపాడతాడు. అతని వెనుక అతన్ని రక్షిస్తాడు.

వీటిద్వారా తెలిసిన విషయమేమిటంటే మనం ఒకరిని సంబోధిస్తున్నప్పుడు సంబోధితునితో ఎలా వ్యవహరించాలో చక్కగా తెలియపరచబడింది. అప్పుడప్పుడు మన నోటి ద్వారా వెలువడే మాటలు ఇతరుల కోసం బాణాలు మాదిరిగా గుచ్చు కుంటాయి. వారిని హతమారుస్తాయి. లేదా గాయపరుస్తాయి. అందుకే చెప్పబడుతుంది, బాణాల గాయాలు అయినా మానిపోతాయి కాని మాటల గాయాలు మటుకు మానవు అని. కనుకనే మనిషి ద్వారా వెలువడే మంచి మాటలైనా లేదా చెడ్డ మాటలైనా చాలాకాలం వరకు పదిలమైపోతాయి.చరిత్రగా మిగిలిపోతాయి.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; చాలామంది ప్రజలు తన నోటి ద్వారా పండించిన పంట కారణంగానే పరలోకంలో వారు నరకంలో పడవేయబడతారు.

ఈ విషయంలో స్త్రీలు కూడా అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే స్త్రీలు అత్యధిక సంఖ్యలో కేవలం తమ నోటి ద్వారానే నరకంలో పడవేయబడతారని తెలియజేయటం జరిగింది. ఎందుకంటే సాధారణ స్త్రీలు ఒకచోట చేరినప్పుడు వారికి మాట్లాడ టానికి ముఖ్యమైన అంశాలు ఏమీ ఉండవు కాబట్టి వారి గురించి వీరి గురించి ఎక్కువగా మాట్లాడతారు. ఇంకా భర్తలు జీవితాంతం వారి కోసం కష్టపడినా కృతజ్ఞతలు తెలుపుకోరు. పైగా నీవు ఎప్పుడు సుఖపెట్టావులే అని నిందిస్తారు.




## దేశంలో పడిపోతున్న జననాల రేటు

ప్రస్తుతం ప్రపంచ జనాభాలో మనదేశం అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారతదేశ జనాభా ఈ ఏడాది 146 కోట్లకు చేరింది. దేశ జనాభా పెరుగుదల, ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ఐక్యరాజ్యసమితి తన జనాభా నివేదికలో వివరించింది. యూఎన్ఎఫ్‌పీఏకు చెందిన స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ (ఎస్ఓడబ్ల్యూపీ) 2025 నివేదికను విడుదల చేసింది. భారతదేశ జనాభా భర్తీ రేటు కంటే జననాల రేటు తక్కువ ఉందని దానిలో వెల్లడించింది. జనాభా పెరుగుదల, తగ్గుదల సంక్షోభం కాదని, జననాల రేటు తగ్గడమే నిజమైన సంక్షోభమని పేర్కొంది. లక్షలాది మంది ప్రజలు పునరుత్పత్తి లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని చెప్పింది. జననాల రేటు 1.9కి పడిపోయిందని, భర్తీ స్థాయి 2.1 కంటే తక్కువగా ఉందని, అంటే జనాభా సంఖ్యను కొనసాగించడానికి కావాల్సిన జననాల రేటులో దేశం లేదని స్పష్టం చేసింది. జననాల రేటు మందగించినా.. యువత జనాభా మాత్రం దేశంలో గణనీయంగానే ఉందని తెలిపింది. 0-14 ఏళ్ల వారు 24 శాతం, 10-19 ఏళ్ల వారు 17 శాతం, 10-24 ఏళ్ల వారు 26 శాతం ఉన్నారని వెల్లడించింది. పని చేసే వయసు (15-64)లో ఉన్న వారు 68 శాతం ఉన్నారని వెల్లడించింది. ఇక 65 ఏళ్లు దాటిన వృద్ధులు మొత్తం జనాభాలో 7 శాతంగా ఉన్నా, ఆయుర్దాయం అంచనా పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధుల సంఖ్య వచ్చే కాలంలో మరింత పెరుగుతుందని అంచనా వేసింది.

## దేశంలో తగ్గుతున్న పేదరికం

భారత్‌లో పేదల సంఖ్య తగ్గిందని తాజాగా ప్రపంచబ్యాంకు నివేదిక వెల్లడించింది. 2011-12లో 27.1 శాతంగా ఉన్న పేదరికం రేటు 2022-23కి 5.3 శాతానికి తగ్గిందని తాజాగా వరల్డ్ బ్యాంకు నివేదిక పేర్కొంది. 2011-12 నాటికి 344.47 మిలియన్ల ప్రజలు పేదరికంలో మగ్గిపోయారని, ఇప్పుడు వారి సంఖ్య 2022-23 నాటికి 75.24 మిలియన్ల ప్రజలే పేదరికంలో ఉన్నారని వీరి సంఖ్య పదకొండేళ్ల కంటే ఇప్పుడు బాగా తగ్గిందని ఈ నివేదిక పేర్కొంది. అంటే దాదాపు 11 సంవత్సరాలలో 269 మిలియన్ల ప్రజలు తీవ్ర పేదరికం నుండి బయటపడ్డారని ఈ నివేదిక స్పష్టం చేసింది. ప్రధానంగా 2011- 12 నాటికి భారత్‌లో అత్యంత పేదవారిలో 65 శాతం మంది ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఉన్నారు. అయితే 2022-23 నాటికి ఈ రాష్ట్రాల్లో పేదరికం మూడింట రెండు వంతులకు తగ్గింది. 2021 ధరల ఆధారంగా.. మూడు డాలర్లు (ఇండియన్ కరెన్సీలో 257 రూపాయలు) కంటే తక్కువ ఖర్చు పెడితే అంతర్జాతీయ దారిద్ర్య రేఖ కంటే దిగువ ఉన్నట్టుగా వరల్డ్ బ్యాంకు అంచనా వేసింది. ఈ లెక్కన చూస్తే భారత్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోజుకు మూడు డాలర్ల కంటే తక్కువ ఖర్చుపెట్టే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని, దీంతో భారత్‌లో పేదరికం తగ్గిందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది.

## పేద ఖైదీలకు సాయపడండి

ఆర్థిక ఇబ్బందుల కారణంగా బెయిల్ పొందలేని, జైలు నుంచి విడుదల కాలేని పేద ఖైదీలకు ఉపశమనం కలిగించేందుకు ఉద్దేశించిన నిధులను రాష్ట్రాలు వినియోగించకపోవడంపై కేంద్ర హోం శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. 2023 మేలో కేంద్రం ప్రారంభించిన 'పేద ఖైదీలకు మద్దతు' పథకానికి అర్హులైన ఖైదీలను గుర్తించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపక పోవడాన్ని తప్పుపట్టింది. ఇప్పటికైనా జరిమానాలు, బెయిల్ పూచీకత్తు చెల్లించలేని కారణంగా కటకటాల్లోనే మగ్గుతున్న పేద ఖైదీలకు తోడ్పడాలని ఈ నెల 3న రాష్ట్రాలకు లేఖ రాసింది. 'పేద ఖైదీలకు మద్దతు' పథకంలో భాగంగా రాష్ట్రాలు జిల్లాకొకటి చొప్పున కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పథకం అమలుకు నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) కేంద్ర నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. ఈ సంస్థకు కేంద్రం ఏటా రూ.20 కోట్లు కేటాయిస్తుంది. జిల్లా సాధికార కమిటీ కేసును క్లియర్ చేస్తే ఖైదీకి రూ.25 వేల వరకు లభిస్తుంది. ఇంతకంటే ఎక్కువ మొత్తం ఉంటే, దానిని రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ నిర్ణయిస్తుంది. ఈ పథకాన్ని సరైన రీతిలో అమలు చేసి పేద ఖైదీలకు విముక్తి కల్పించడం ద్వారా వారిని జన జీవన స్రవంతిలో కలిసేందుకు సాయపడాలని కోరింది. అయితే, అవినీతి నిరోధక, మనీ లాండరింగ్, డ్రగ్స్, ఉపా తదితర చట్టాల పరిధిలోకి వచ్చే నేరాలకు పాల్పడిన వారికి ఈ ప్రయోజనం వర్తించదని హోం శాఖ స్పష్టం చేసింది.

## 2027 మార్చి 1నుంచి జన గణన

దేశవ్యాప్తంగా జన గణనతోపాటే కుల గణన దిశగా అడుగులు పడుతున్నాయి. 2027 మార్చి ఒకటో తేదీ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని కేంద్ర హోంశాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఇటీవలె ఒక ప్రకటన విడుదల చేసింది. జనాభా లెక్కల సేకరణలో అంతర్భాగంగా కులాల వారీగా జనాభా గణాంకాలు కూడా సేకరించాలని నిర్ణయించడం దేశంలో ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈసారి రెండు దశల్లో జన గణన నిర్వహించనున్నారు. హిమాలయ పర్వత ప్రాంతాలైన లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్లో వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని 2026 అక్టోబర్ 1న జన గణన ప్రారంభించాలని నిర్ణయించారు. జన గణన, కుల గణన అంశాన్ని ఈ నెల 16వ తేదీన గెజిట్లో ప్రచురించే అవకాశం ఉంది.

## సర్వత్రా

## గాజాలో యుద్ధాన్ని ఆపాలి

గాజాలో యుద్ధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ సుమారు 30,000 మంది ప్రదర్శనకారులు ఇటలీ రాజధాని నగరం రోమ్ వీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. ఇటలీ ప్రధాన ప్రతిపక్షమైన వామపక్షంతో పాటు పలు పార్టీల పిలుపుమేరకు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన నిరసనకారులు ర్యాలీలో పాల్గొన్నారు. వీరిలో చిన్న పిల్లలతో ఉన్న కుటుంబాలు కూడా ఉన్నాయి. మితవాద ప్రభుత్వం మౌనంగా ఉందని, గాజాలో మారణకాండపై ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని నిరసకారులు డిమాండ్ చేశారు. పాలస్తీనా, ప్రతిపక్ష పార్టీల జెండాలను చేతబూని "ఊచకోతను ఆపండి, కుట్రను ఆపండి" అనే ప్లకార్డులను నిరసనకారులు ప్రదర్శించారు. పాలస్తీనియన్ల ఊచకోతకు, ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహూ నేరాలను ఎండగట్టేందుకు ఇది ఒక అపారమైన ప్రజా ప్రతిస్పందనని ఇటలీ సెంటర్ లెఫ్ట్ డెమోక్రటిక్ పార్టీ నేత ఎల్లీష్లీన్ అన్నారు. ఇటలీ ప్రధాని మెలోనీ తీరుపై ఆమె విమర్శలు చేశారు. మెలోని ప్రభుత్వ విధానం మాదిరిగా కాకుండా మౌనంగా ఉండని మరొక ఇటలీ ఉందని అన్నారు. అసాధారణమైన ఊచకోత, క్రూరమైన, అనుచితమైన ప్రతిచర్య జరిగినప్పటికీ ఇటాలియన్ ప్రభుత్వం స్పందించడం లేదని ట్యునీషియా ప్రదర్శనకారుడు ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు.

## అమెరికాలో భారత విద్యార్థులు 11.8 శాతం పెరిగారు

అమెరికాలో భారత విద్యార్థుల సంఖ్యలో 2024లో 11.8 శాతం పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం అమెరికాలో 4,22,335 మంది భారత విద్యార్థులున్నట్టు యూఎస్ ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్ఫోర్స్మెంట్ (ఐసీఈ) విడుదల చేసిన స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రాం (ఎస్ఈవీపీ) తాజా వార్షిక నివేదిక వెల్లడించింది. అమెరికాలోని మొత్తం విదేశీ విద్యార్థుల్లో ఇది 27 శాతం. ఈ విషయంలో భారత్ గత 15 ఏళ్లలో తొలిసారిగా చైనా (20 శాతం)ను దాటేసి అగ్రస్థానంలో నిలవడం విశేషం. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ మెటిక్స్ (స్టెమ్) కోర్సుల్లో అత్యధికంగా 48 శాతం మంది భారత విద్యార్థులే. 20.4 శాతంతో చైనా రెండో స్థానంలో ఉంది. మొత్తంగా చైనా విద్యార్థుల సంఖ్య 2023తో పోలిస్తే 0.25 శాతం తగ్గడం విశేషం. అమెరికాలో చదువుతున్న విదేశీయుల్లో ఆసియా దేశాల హవా కొనసాగుతోంది. మొత్తం 15.8 లక్షల మంది విదేశీ విద్యార్థుల్లో 71.7 శాతం, అంటే 11,34,953 మంది ఆ దేశాలవారేనని నివేదిక తెలిపింది.

## అక్కడ ఏడాదికి 25,000 రోజులు

భూమి సూర్యుని చుట్టూ ఒకసారి తిరిగిరావడానికి 365 రోజులు పడుతుందని తెల్సిందే. అదే మాదిరి ఒక చిన్నపాటి మరుగుజ్జు గ్రహం లాంటి ఖగోళ వస్తువు మన సూర్యుని చుట్టూ అత్యంత నెమ్మదిగా తిరుగుతోంది. ఎంతగా అంటే ఒక చుట్టు చుట్టేయడానికి ఏకంగా 25,000 రోజుల సమయం తీసుకుంటోంది. సౌరమండలంలో కొత్తగా కనిపెట్టిన ఈ మరుగుజ్జు గ్రహానికి 2017 ఓఎఫ్ 201 అని పేరుపెట్టారు. అయితే దీనిని గ్రహం హోదా ఇవ్వాలా వద్దా అనే చర్చ జరుగుతోంది. ఎందుకంటే దీనికి పూర్తిస్థాయిలో గ్రహ లక్షణాలు లేవని తేలింది. నెప్ట్యూన్ గ్రహం ఎంత దూరంలో అయితే సూర్యుడి చుట్టూ తిరుగుతోందో అంతకంటే కాస్తంత ఎక్కువ దూరంలో ఈ అంతరిక్ష పదార్థం మన సూర్యుని చుట్టూ తిరుగుతోంది. ఇది చాలా నెమ్మదిగా పరిభ్రమిస్తోంది. ఒకసారి సూర్యుడిని చుట్టిరావడానికి 25,000 రోజుల సమయం తీసుకుంటోంది. దీని వెడల్పు ఏకంగా 700 కిలోమీటర్లు. కోట్ల సంవత్సరాలుగా ఒకే కక్ష్యలో పరిభ్రమిస్తోంది.

## వేగంగా పెరుగుతున్న ఇస్లాం

ప్రపంచంలో ప్రధాన మతాలను అనుసరించే వారి సంఖ్య ఓ వైపున పెరుగుతుంటే.. మరోవైపు తమకు ఎలాంటి మతమూ లేదని చెప్పేవారు కూడా గణనీయంగానే ఉన్నారు. క్రైస్తవం ఇప్పటికీ అతి పెద్ద మతంగా కొనసాగుతున్నప్పటికీ, మతం వద్దనుకొనే వారి సంఖ్య కూడా దాంట్లోనే అధికంగా ఉంది. అందువల్ల శాతాల్లో లెక్కిస్తే క్రైస్తవుల సంఖ్య తగ్గుతోంది. ఇంకోవైపు ప్రపంచవ్యాప్తంగా ముస్లింల జనాభా పెరుగుతూ ఈ శతాబ్దం మధ్యభాగం నాటికి ఇస్లామ్ క్రైస్తవంతో సమానం కానుంది. హిందువుల జనాభా స్థిరంగా ఉండగా, బౌద్ధుల సంఖ్య పడిపోతోంది. ప్యూ రీసెర్చి సెంటర్ జరిపిన అధ్యయనంలో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. 2010-2020 కాలానికి చెందిన జనాభా లెక్కలు, సర్వేలను అధ్యయనం చేసిన ప్యూ సెంటర్ మతాల వారీగా జనాభా పెరుగుదలలో మార్పులను గుర్తించింది. ఈ పదేళ్ల కాలంలో క్రైస్తవుల జనాభా 218 కోట్ల నుంచి 230 కోట్లకు పెరిగింది. అయితే ప్రపంచ జనాభాలో క్రైస్తవుల వాటా తగ్గింది. 2010లో 30.6 శాతం ఉండగా, అది 28.8 శాతానికి పడిపోయింది. అదే సమయంలో ముస్లిం జనాభా 34.70 కోట్ల మేర అధికమయింది. మొత్తం జనాభా సుమారు 200 కోట్ల వరకు ఉంది. 1.8 పాయింట్ల వృద్ధి శాతంతో ప్రపంచ జనాభాలో 25.6 శాతం వాటా పొందింది.

**29వ పేజీ తరువాయి...**

తీసుకోవడం అనే అంశం ఒకటి. ఇది అత్యున్నత ఇస్లామీయ నైతికత. అల్లాహ్ నామాలలో అల్-జబ్బార్ (జోడించేవాడు) ఒకటి. ఆయన హృదయ పగుళ్లను, గాయ పడిన మనసులను బాగుచేసేవాడు. జబర్ అన్న పదానికి ఒక అర్థం కట్టు కట్టడం అని ఉంది. అంటే, పేదలను సంపన్నులను చేసేవాడు, అవసరమైన వారికి ప్రతి కష్టాన్ని సులభతరం చేసేవాడు. మానవ మహోపకారి ముహమ్మద్ (స) వారిలో ఈ లక్షణం మెండుగా ఉండేది. మన సజ్జన పూర్వీకులు సయితం ఈ గుణాన్ని పుణికిపుచ్చుకున్నారు.

అల్లాహ్‌ను తప్ప మరెవర్నీ ఆరాధించరాదని, తల్లిదండ్రుల పట్ల, బంధువుల పట్ల, అనాథల పట్ల, నిరుపేదల పట్ల సద్భావనతో మెలగాలని ప్రజలతో (చిరునవ్వు మోముతో) మంచిమాటలు పలకాలని, ప్రార్థనా వ్యవస్థ (నమాజ్) స్థాపించాలని, (పేదల ఆర్థిక హక్కు) జకాత్ చెల్లిస్తూ ఉండా లని మేము ఇస్రాయీల్ సంతతి చేత ప్రమాణం చేయించాం. (అల్-బఖర : 83)

సుదీర్ఘ వాదనల కంటే చిన్నపాటి సర్దుబాటే పరిష్కారం, చిటపటల మాటలకంటే మందస్మిత మౌనమే సమాధానం, అరచి చేసే సహాయం కంటే అక్కున చేర్చుకొనే ఆదరణే ముఖ్యం- జ్ఞానంతో కూడిన అహం కంటే చదువు లేని సంస్కారం మిన్న. మన ప్రేమలో నిజాయితీ ఉండాలి, మన స్నేహంలో నమ్మకం ఉండాలి, మన మాటలో వినయం ఉండాలి, మన నవ్వులో స్వచ్ఛత ఉండాలి, మన గుణంలో సహనం ఉండాలి. ప్రేమ ఉన్న చోట రక్షణ ఉంటుంది, రక్షణ ఉన్న చోట బంధం ఉంటుంది, బంధం ఉన్న చోట ధైర్యం ఉంటుంది, ధైర్యం ఉన్న చోట ధర్మం ఉంటుంది - ఇవన్నీ మిళితమైన జీవితం స్వచ్ఛంగా ఉంటుంది. ఆప్యాయత ఉంటే అనురాగం విలువ

> **సానుకూల దృక్పథం లేని మేధావి సమాజానికి చేటు, సంస్కారం లేని విజ్ఞాని మేధావి వర్గానికి చేటు. విలువలు లేని వ్యక్తిత్వం నడవడికకు చేటు - ఇవన్నీ అధిగమించిన జీవితమే అసలు గ్రేటు, పదిమందికి ఆదర్శం కూడా.**


తెలుస్తుంది, ఆత్మీయత ఉంటే బంధం విలువ తెలుస్తుంది, మనం అనే భావం ఉంటే మానవత్వం విలువ తెలుస్తుంది - ఇవన్నీ మిళితమై ఉంటేనే విలువైన జీవితం వికసిస్తుంది.

ఒక మంచి మాట, నగుమోము సంభాషణ కూడా పుణ్యకార్యమే అన్నారు ప్రవక్త(స). అందుకే మన సజ్జన పూర్వీకుల హృదయాలు పవిత్రంగా ఉండేవి. వారు సదా సత్యమే పలికేవారు. వారి ఆచరణ ఆదర్శవంతంగా ఉండేది. వారు అత్యంత నీతిమంతు డైన, అత్యంత భక్తిగల ప్రవక్తను అనుసరించారు. వారు ఆయన సున్నత్‌ను అనుసరించారు కానీ కొత్త పుంతలు తొక్కలేదు. బిద్అత్‌కి పాల్పడలేదు. ఏనాడూ అధర్మ అడుసు తొక్కలేదు. సృష్టికర్తను ధిక్కరించే ధైర్యం, ఆయన ఆదేశాలను జవదాటే సాహసం చేయలేదు. అల్లాహ్ తనకు ప్రసాదించిన దానిలో నుండి ప్రతి ఒక్కరూ ఖర్చు చేశారు.

అహం హద్దులు మీరితే బంధాలు బలహీనమవుతాయి, ఆశ హద్దులు మీరితే అనుబంధాలు అవహేళనకు గురవుతాయి, స్వార్థం హద్దులు మీరితే రక్తసంబంధాలు రక్తసిక్తం అవుతాయి, ద్వేషం వదలి ప్రేమ భావం పెరిగితే బంధాలు అనుబంధాలుగా మారి తరతరాలు తరించి పోతాయి అంటుంది ఇస్లాం.

సానుకూల దృక్పథం లేని మేధావి సమాజానికి చేటు, సంస్కారం లేని విజ్ఞాని మేధావి వర్గానికి చేటు. విలువలు లేని వ్యక్తిత్వం నడవడికకు చేటు- ఇవన్నీ అధిగమించిన జీవితమే అసలు గ్రేటు, పది మందికి ఆదర్శం కూడా. కోపం ఉన్న మనిషికి ప్రేమ ఎక్కువ, ఆవేశం ఉన్న మనిషికి ఆలోచన తక్కువ, అహం ఉన్న మనిషికి స్వార్థం ఎక్కువ, ద్వేషం ఉన్న మనిషికి అవగాహన తక్కువ- ఎక్కువ తక్కువల మేళవింపులో సమతౌల్యం లోపిస్తుంది. ఫలితంగా మనిషి ప్రవర్తన గాడి తప్పుతుంది. అలా గాడి తప్పిన మన ప్రవర్తనను తిరిగి గాడిలో పడేలా చేసుకోవడం మనందరి విద్యుక్త ధర్మం.

**తుదిగేటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**